94931 70689 www.rajadhanivartalu.com rajadhanivartalu rajadhaniv RNI No. APTEL 2015/ 66622 స్థాపితం : 2015 Postal Regd No: GTR/84/2016-18

ఆంధ్రప్రదేశ్ ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా అమరావతి వెల్ఫేర్ కౌన్సిల్ (ఎ.డబ్ల్యు.సి)
భాగస్వాములు కాదలిచిన వారు సంప్రదించండి
76809 94755, 88861 11881.
FB:amaravathiwelfarecouncil

# రాజధాని వార్తలు

Voice of Voiceless

| తేదీ | వారం | సహార్ (ఉదయం) | ఇఫ్తార్ (సాయంత్రం) |
|---|---|---|---|
| 3 | ఆది | 04:07 | 07:14 |
| 4 | సోమ | 04:07 | 07:14 |
| 5 | మంగళ | 04:07 | 07:15 |
| 6 | బుధ | 04:07 | 07:15 |
| 7 | గురు | 04:06 | 07:15 |
| 8 | శుక్ర | 04:06 | 07:16 |
| 9 | శని | 04:06 | 07:16 |
| 10 | ఆది | 04:06 | 07:17 |

అమరావతి సంపుటి : 3 సంచిక 37, పేజీలు 4 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు వార పత్రిక సోమవారం 4 - ఆదివారం 10 జూన్, 2018

వివరాలు2లో..



ఆర్థిక నగరాలతో యువతకు ఉపాధి

వివరాలు3లో..



ఐర్లాండు మహిళా విజయం

వివరాలు3లో..



16న ప్రధాని, ముఖ్యమంత్రుల భేటీ

వివరాలు4లో..



ముస్లింల ఆర్థిక, సామాజిక స్థితులపై సచార్ నివేదిక



## జీతాలు మహాప్రభో..

- మహిళాకార్మికుల ఆకలి కేకలు
- పట్టించుకోని మంత్రులు, అధికారులు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ఈవెంట్లు, ఫెస్టులు ఘనంగా నిర్వహించే నవ్యాంధ్ర ప్రభుత్వం,సాక్షాత్తూ సచివాలయంలో హౌస్‌కీపింగ్ పనిచేస్తున్న మహిళా కార్మికుల ఆకలి కేకలు మాత్రం వినిపించుకోవడం లేదు. మంత్రులు, అధికారులకు వాళ్లు సకల సౌకర్యాలు అందిస్తున్న ఆ బడుగుజీవులకు నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు.

నవ్యాంధ్ర రాజధాని నిర్మాణం కోసం 33 వేల ఎకరాల భూమిని ప్రభుత్వం సమీకరించింది. దీంతో ఆ ప్రాంతంలో రైతుకూలీలకు పనులు లేకుండా పోయాయి. ఈ క్రమంలో సీఆర్డీఏ ఆధ్వర్యంలో కాంట్రాక్టు వ్యవస్థ ద్వారా స్థానిక మహిళలు హౌస్ కీపింగ్ సెక్షన్‌లో ఉపాధి పొందుతున్నారు. దాదాపు 250 మందికి పైగా ఉన్న హౌస్ కీపింగ్ ఉద్యోగులు సచివాలయంలోని ప్రతి బ్లాక్‌ని పరిశుభ్రంగా ఉంచటంలో కీలక పాత్ర పోషిస్తుంటారు. వీరు విధులో చేరిన ప్రారంభంలో జీతం రూ.8 వేలని, మూడు మాసాల తర్వాత రూ.12 వేలని సదరు కాంట్రాక్టరు నమ్మబలికి, నెలనెలా జీతాలు కూడా ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు.

**అత్యంత హీనమైన స్థితిలో..**

సచివాలయంలో ఎస్.కె.ఈ కాంట్రాక్టు

- మిగతా 2 లో

# ఏపీపై సవతి తల్లిప్రేమను చూపిస్తున్నారు



దీక్షా శిబిరం వద్దకు నడుచుకుంటూ వస్తున్న సీఎం చంద్రబాబు



ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు

**నవనిర్మాణ దీక్షలో చంద్రబాబు**

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** విజయవాడ బెంజ్ సర్కిల్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం ఉదయం నవ నిర్మాణ దీక్షను నిర్వహించారు. డీవీ మ్యానర్ నుంచి సీఎం ర్యాలీగా బెంజ్‌సర్కిల్‌కు కాలినడకన చేరుకున్నారు. ప్రజలతో 'ప్రతిజ్ఞ బూనుదాం, ప్రగతి సాదిద్ధాం' నినాదంలో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అన్ని రాష్ట్రాలు అవతరణ దినోత్సవాలను జరుపుకొంటున్నాయని.. మనకు ఏమి ఇచ్చారని దినోత్సవాలను జరుపుకోవాలని సీఎం ప్రశ్నించారు. ఆంధ్రప్రదేశ్‌పై కేంద్రం సవతి తల్లి ప్రేమను చూపిస్తోందని చంద్రబాబు విమర్శించారు. అడుగడుగునా అవమానం చేస్తూనే ఉన్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షోభాలను అవకాశాలుగా మలచుకొని ముందుకెళ్తున్నామని అన్నారు. విభజన నష్టాన్ని ఎదుర్కొని ఇప్పుడిప్పుడే ముందుకొచ్చామని పేర్కొన్నారు. దేశంలోనే ఏపీని నెం.1 రాష్ట్రంగా తయరు చేసే శక్తి, సామర్థ్యం తెలుగువారికి ఉందని వెల్లడించారు. అభద్రతా భావంలో ఉన్న ప్రజలకు విశ్వాసం నింపే ప్రయత్నం చేస్తున్నామని అన్నారు. తొలిసారిగా గోదావరి-కృష్ణా నదుల అనుసంధానం చేశామని సీఎం గుర్తుచేశారు. పట్టిసీమ వల్ల కృష్ణా డెల్టాకు జూన్‌లోనే నీళ్లు ఇచ్చామని చెప్పారు. 5 నదులను అనుసంధానం చేయాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వెల్లడించారు. రాయలసీమకు నీళ్లు ఇచ్చి భద్రత కల్పించాలన్నది తమ లక్ష్యమని పేర్కొన్నారు.


ఢిల్లీ కంటే సుందర రాజధాని నిర్మించుకోవచ్చని స్వయంగా ప్రధాని చెప్పారని గుర్తుచేశారు. ఆనాడు ఇచ్చిన హామీని మరచిపోయి గుజరాత్‌లో దోలేరో నగరాన్ని నిర్మిస్తున్నారని.. నష్టపోయింది గుజరాత్ కాదు.. ఆంధ్రప్రదేశ్ అని గుర్తుంచుకోవాలని కోరారు. తెలుగుజాతికి రాజధాని నిర్మించాలన్నదే తన లక్ష్యమని చంద్రబాబు ప్రకటించారు. అమరావతి నిర్మాణంలో సింగపూర్ ప్రధాని కూడా భాగమవుతున్నారని అన్నారు. లాభాలు లేని దిల్లీ-ముంబయి బుల్లెట్ రైలుకు నిధులు ఎలా ఇస్తారు? అని సీఎం ప్రశ్నించారు. ఇక్కడ మెట్రో రైలు అడిగితే గిట్టుబాటు కాదంటున్నారని మండిపడ్డారు. విశాఖ రైల్వే జోన్‌పై కేంద్రం మోసపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

ప్రత్యేక హోదా ఆంధ్రుల హక్కంటూ నవనిర్మాణ దీక్షా వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నినదించారు. విభజన గాయాల నుంచి ఇంకా తేరుకోక ముందే రాష్ట్ర ప్రజలకు మళ్లీ కుట్ర రాజకీయాలు అభద్రతా భావాన్ని సృష్టిస్తున్నాయని విమర్శించారు. భావితరాల

- మిగతా 2 లో

## ట్రంప్‌తో కిమ్ జాంగ్ భేటీకి తేదీ ఖరారు

**జూన్ 12న సింగపూర్ లో సమావేశం**



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ ల భేటీకి తేదీ ఖరారయింది. జూన్ 12వ తేదీన సింగపూర్ లో తమ సమావేశం కొనసాగనుందని ట్రంప్ స్వయంగా వెల్లడించారు. వైట్ హౌస్ లో ఉత్తర కొరియా రాయబారి కిమ్ యోంగ్ చోల్ తో దాదాపు 80 నిమిషాల పాటు చర్చించిన అనంతరం ఈ తేదీని ఖరారు చేశారు. ఈ సందర్భంగా కిమ్ జాంగ్ పంపిన లేఖను ట్రంప్ కు కిమ్ యోంగ్ చోల్ అందించారు. కొరియాను అణు రహిత దేశంగా మార్చాలన్న ప్రధాన ఉద్దేశంతోనే ట్రంప్, కిమ్ ల భేటీ జరగనుంది. అయితే అణురహిత దేశంగా కొరియాను మార్చడమన్నది ఒక సుదీర్ఘమైన ప్రక్రియ అని ట్రంప్ అన్నారు. ఇది ఒక్క సమావేశంతోనే అయిపోయేది కాదని చెప్పారు.

## రాయపూడిలో నవనిర్మాణ దీక్షలు



**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్ర ప్రభుత్వం నవనిర్మాణ దీక్షలు ఈ నెల 2 నుంచి 8 వరకు జరుపుతోంది. ఇందులో భాగంగా రాజధాని ప్రాంతమైన రాయపూడి లో ర్యాలీ జరిపి, ఎల్.పీ.ఇ స్కూల్ ఆవరణలో శనివారం ఉదయం 9.30 నిముషాలకు గ్రామ సభ ఏర్పాటుచేశారు. గ్రామ సభలో 4 ఏళ్లుగా జరిగిన అభివృద్ధి పనులనులపై పంచాయతీ కార్యదర్శి గాదె వెంకటప్పయ్య గ్రామస్తులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధితిగా నోడల్ అధికారిగా జెడ్.పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు, సర్పంచ్, స్కూల్ టీచర్లు, ఆశావర్కర్లు, రెవిన్యూ వీఆర్వో, గ్రామస్తులు పాల్గొన్నారు.

# మసీదుల మరమ్మతులకు రూ.5కోట్లు

- రంజాన్ తోఫా సక్రమంగా అందించాలి
- అధికారులతో సమీక్షలో చంద్రబాబు

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** ముస్లిం మైనార్టీల సంక్షేమానికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో ముఖ్యమంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. మసీదుల మరమ్మతులు నిమిత్తం కేటాయించిన రూ. 5కోట్లు ను సద్వినియోగం చేసుకునేలా చూడాలని అన్నారు. 12లక్షల కుటుంబాలకు రంజాన్ తోఫా సక్రమంగా చేరాలని, రాష్ట్రంలో ప్రతీ పేద ముస్లిం కుటుంబ సభ్యులతో సంతోషంగా రంజాన్ పండుగ జరుపుకునేలా చూడాలని చెప్పారు. మసీదుల మరమ్మతులకు, ఇఫ్తార్ నిర్వహణకు రూ.5కోట్లు విడుదల చేశామని, వీటిని సద్వినియోగం చేసుకొని, మసీదులకు రంగులు వేయడం, చిన్న చిన్న మరమ్మతుల వంటి పనులను పూర్తి చేయాలని సూచించారు. రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అన్ని చోట్ల ఖురాన్ పఠనం పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. పెద్ద మదర్‌సాలలో కంప్యూటర్ శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ముస్లిం యువతకు ఉర్దూలో శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు పెంపొందించాలని సూచించారు. ముస్లిం అనాథలకు, ఒంటరి మహిళలకు, వితంతువులకు సంతృప్తస్థాయిలో (శాచురేషన్) పింఛన్లు పంపిణీ చేసి, ప్రతినెలా రూ.1,000 పింఛన్ అందేలా చూడాలని చెప్పారు. వారిలో వెనుకబాటును దృష్టిలో ఉంచుకునే బడ్జెట్‌ను రూ.1.100కోట్లతో ముస్లిం మైనార్టీలకు ఏర్పాటు చేశామని ఇది చరిత్ర అని అన్నారు. ముస్లింలకు ఇచ్చిన అన్ని హామీలను దాదాపుగా అమలుచేశామని, మిగిలిన హామీలు కూడా ఈ ఏడాదిలోపే నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సీఎంవో కార్యదర్శి గిరిజా శంకర్, ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ శాఖ కార్యదర్శి కె. రాంగోపాల్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండి ఉషాకుమారి, నంద్యాల మైనారిటీ పెద్ద మౌలానా ముష్తాఖ్ అహ్మద్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

# సొంత నియోజకవర్గంలో రోజా గృహ ప్రవేశం !

**రాజధాని ప్రతినిధి, నగరి :** చంద్రబాబు పార్టీ ఆఫీసు నిర్మాణం మాత్రమే నవ్యాంధ్రలో జరుగుతుండగా, ఆయన బంగ్లా మాత్రం హైదరాబాద్‌లోనే కట్టుకున్నారు. వైసీపీ అధినేత జగన్ తన నివాసాన్ని, పార్టీ ఆఫీసు నిర్మాణపు పనులు చకచకా జరుగుతుండగా, పవన్ కల్యాణ్ కూడా మంగళగిరిలో ఇల్లు, పార్టీ ఆఫీసు ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇందుకు కారణం వీరంతా ఇక్క చట్టపు చూపుగా వచ్చేవారు కాదని తమ సమస్యలపై పోరాటం జరుపుతారన్న నమ్మకాన్ని ప్రజల్లో కలిగించడం కోసమే అని గుర్తించాలి. అయితే అందరికంటే ముందుగా నగరి ఎమ్మెల్యే రోజా మాత్రం తన నియోజకవర్గంలో ఇంటిని కట్టించుకోవడమే కాకుండా గృహ ప్రవేశం కూడా జరిపించారు.



వైసీపీ రాష్ట్ర నేత - మహిళా నాయకురాలు ఆర్కే రోజా నా ప్రజల వద్దే నేనుంటానంటూ ఆమె గత ఏడాది ప్రకటించారు. అందులో భాగంగా నియోజకవర్గ కేంద్రంలో తన ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టి ఏడాదిలోనే పూర్తి చేసి శుభముహూర్తాన భర్త సెల్వమణితో కలిసి ఆమె కొత్త ఇంట్లో పూజలు నిర్వహించారు.

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నియోజకవర్గంలో ఉంటేనే ప్రజలకు నాయకులకు మంచిది. వైసీపీ నేతల్లో తన మాటలతో తెలుగుదేశం నేతలకు నిద్ర లేకుండా చేసే వారిలో రోజా ఒకరు. వచ్చే ఎన్నికల్లో ఎలాగూ వైసీపీకి విజయావకాశాలు ఎక్కువగా ఉన్నాయి. పార్టీలో కీలకంగా వ్యవహరిస్తూ యాక్టివ్గా ఉండే రోజాకు వైఎస్ జగన్ కచ్చితంగా ఈసారి నగరి టిక్కెట్ ఇస్తారు. కాబట్టి ఈసారి ఎట్టి పరిస్థితుల్లో మరోసారి విజయపతాక ఎగరేయాలని రోజా భావిస్తున్నారు. అందుకే ఇక నగరిలోనే ఉండాలని నిర్ణయించుకుని కొత్త ఇల్లు సిద్ధం చేసుకున్నారు..గృహ ప్రవేశ కార్యక్రమానికి రోజా బంధువులు పలువురు స్థానిక నేతలు అనుచరులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# మసకబారుతున్న కమలం



- 2014 నుంచి ఇప్పటి వరకూ ఉపఎన్నికల్లో మూడుసార్లు పరాజయం
- కంచుకోటకు బీటలు
- చెక్ పెట్టిన ఎస్సీ, బీఎస్సీ
- 2019 పరిస్థితిపై కమలనాథుల్లో కలవరం

**లక్నో :** ఉత్తర్‌ప్రదేశ్‌లో బీజేపీ ప్రభ మసకబారుతోంది. 2014 లోక్‌సభ ఎన్నికల తరువాత ఓటముల్లో 'హ్యాట్రిక్' కొట్టింది. మూడుసార్లు జరిగి ఉపఎన్నికల్లో వరుసగా ఓటమి పాలైంది. తాజాగా సూరాపూర్ అసెంబ్లీ స్థానంలోనూ ఓడిపోవడం గమనార్హం. నవంబరు 2017లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలను మినహాయిస్తే. బీజేపీ హవా 15 నెలల్లోనే దారుణంగా తగ్గడం కాషాయం పార్టీ శ్రేణుల్లో ఆందోళనకు కారణమవుతోంది. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటులో కీలకపాత్ర పోషించే ఉత్తర్‌ప్రదేశ్లో పట్టుకోల్పోతే, అధికారంలోకి రావడం కష్టమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కాంగ్రెస్, ఎస్సీ, బీఎస్సీ ఉమ్మడిగా ఎన్నికలరంగంలోకి దిగితే సానుకూల ఫలితాలు వస్తాయని మరోసారి రుజువైంది. 2014లో లోక్‌సభ ఎన్నికల తరువాత జరిగిన అన్ని ఉప ఎన్నికల్లోనూ బీజేపీ ఓటమి పాలవడం గమనార్హం. 2014లో మైన్‌పురీ, 2018 లో గోరఖ్‌పుర్, పూల్ పుర్‌బీ తాజాగా కైరానా లోక్‌సభ స్థానాల్లో ఆ పార్టీ అభ్యర్థులు పరాజయం పాలయ్యారు.

**యూపీదే అగ్రతాంబూలం**

1984లో కేవలం రెండు లోక్‌సభ సీట్లు సాధించిన బీజేపీ.. అయోధ్యలో రామమందిర నిర్మాణం కడతామనే హామీతో దేశవ్యాప్తంగా విశేష ఆదరణ సంపాదించింది. 1996లో 161 స్థానాలు సాధించి పెద్దపార్టీగా అవతరించింది. ఇందులో 51 సీట్లు ఉత్తరప్రదేశ్ నుంచే గెలవడం విశేషం. మిత్రపక్షాలతో కలసి వాజ్‌పేయి ప్రధానిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. పూర్తి మెజార్టీ లేకపోవడంతో 18 రోజులకే కేంద్రప్రభుత్వం కుప్పకూలింది. 1998 ఎన్నికల్లో బీజేపీ నేతృత్వాన ఎన్డీఏ అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి 182 సీట్లు వచ్చాయి. ఇందులో 58 సీట్లు ఒక్క యూపీ నుంచే గెలుపొందడంతో అధికారంలోకి రావడానికి మార్గం సుగమమైంది. కాంగ్రెస్ 141 స్థానాల్లో గెలుపొందినా, యూపీలో ఒక్కసీటు కూడా గెలుపొందకపోవడంతో ఆ పార్టీ అధికారానికి దూరమైందని చెప్పవచ్చు, 1999లో జరిగిన ఎన్నికల్లో 29 స్థానాలకే బీజేపీ పరిమితమైంది. అయినా ఇతర రాష్ట్రాల్లో బలం పుంచుకోవడంతో 182 స్థానాల్లో గెలుపొంది, అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించడంతో వాజ్‌పేయి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగారు. 1999-2000 మధ్య ఉత్తరాఖండ్ విడిపోవడంతో యూపీలో లోక్‌సభ స్థానాల సంఖ్య 80కు పరిమితమైంది. 2004లో బీజేపీ పది స్థానాల్లో మాత్రమే గెలవగలిగింది. ఫలితంగా కేంద్రంలో అధికారానికి దగ్గర కాలేకపోయింది. 2009లో జరిగిన ఎన్నికల్లో బీజేపీ యూపీలో పుంచుకోలేదు. పదిస్థానాలకే పరిమితమైంది. మొత్తానికి 116 సీట్లు గెలిచింది. 206 సీట్లతో కాంగ్రెస్ అతిపెద్ద పార్టీగా అవతరించడంతో యూపీఏ సంకీర్ణం కేంద్రాన రెండోసారి కొలువుతీరింది. 2014 లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ రికార్డుస్థాయి విజయం సాధించింది. ఏకంగా 11 స్థానాలు గెలుచుకుంది. మిత్ర పక్షంగా పోటీచేసిన అప్నాదళ్‌కు మరో సీటు దక్కడంతో పూర్తిస్థాయి మెజార్టీతో కేంద్రాన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది.

**బద్దలైన బీజేపీ కంచుకోట**

గోరఖ్‌పుర్ లోక్‌సభ స్థానానికి 2018 లో జరిగిన ఉప ఎన్నికలో బీఎస్సీ మద్దతుతో పోటీలో నిలిచిన ఎస్సీ అభ్యర్థి ప్రవీణ్‌కుమార్ నిషాద్ 21,961 ఓట్ల మెజార్టీతో ఉపేంద్ర దత్త శుక్లా(బీజేపీ)పై గెలుపొందారు. 2014 ఎన్నికల్లో యోగి ఆదిత్యనాథ్ ఇదేస్థానం నుంచి 1,42,809 ఓట్ల మెజార్టీ సాధించడం విశేషం. యోగి మెజార్టీ, నిషాద్ ఆధిక్యాన్ని కలుపుకుంటే 1,64,270 మంది బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసినట్లు భావించవచ్చు.





## 24న దళిత జాతీయ సదస్సు

**రాజధాని ప్రతినిధి, విశాఖ :** భారత సమాజం -దళిత సమస్యలు అంశంపై జూన్ 24న దళిత మేల్కొలుపు జాతీయ సదస్సును నిర్వహించనున్నట్లు ఫోరం ఫర్ దళిత స్టడీస్ వ్యవస్థాపకుడు, సదస్సు నిర్వాహకుడు ఆచార్య పి.అరుణ్‌కుమార్ తెలిపారు. విశాఖలోని అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ, ఫోరం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించే ఈ సదస్సు 24న ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ఈ సదస్సు యూపీఎస్సీ మాజీ ఛైర్మన్, మాజీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఎస్. చలం ముఖ్యఅతిథిగా హాజరవుతుండగా, సదస్సు ఛైర్మన్‌గా ఆచార్య కె.వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారు. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య ఆర్. లింబాద్రి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి కేజీ శంకర్ ఈ సదస్సులో పాల్గొంటారన్నారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి టీఎస్ కృష్ణ, పలువురు ఆచార్యులు, జడ్జిలు, మేధావులు,పరిశోధనా పత్రాలు సమర్పిస్తారన్నారు. సుప్రీంకోర్టు జడ్జిలు కూడా హాజరుకానున్నట్లు చెప్పారు.భారత రాజ్యాంగం రిజర్వేషన్ల తీరు, తదితర అంశాలపై ఉపన్యాసాలు ఉంటాయన్నారు.

# ప్లాస్టిక్ నియంత్రణపై చర్యలు

**5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం**

**హైదరాబాద్ :** పర్యావరణ రక్షణ చర్యలపై ప్రజలంతా అవగాహన కలిగి ఉండటం కోసం రాష్ట్ర ప్రభుత్వాలు, అటవీ శాఖ తగిన చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. ఐక్యరాజ్యాసమితి నేతృత్వంలో పర్యావరణ 'దినోత్సవవ ఏటా ఒక్కో దేశంలో నిర్వహించటం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది భారతదేశం ఇందులో భాగమవుతూ, నిత్యజీవితంలో ప్లాస్టిక్ మేలు కన్నా కీడే ఎక్కువ చేస్తోందన్న విషయాన్ని అందరూ గుర్తించేలా రాష్ట్ర ప్రభుత్వాలు కార్యక్రమాలు నిర్వహించాలని కేంద్రం కోరింది. ప్లాస్టిక్ వినియోగాన్ని వ్యతిరేకించటం, లేదా వీలైనంతగా తగ్గించటం, రీసైకిల్ చేయటం లాంటి వాటిని అనుసరించాలని కేంద్రం సూచించింది. అదేసమయంలో ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా వాడదగిన వస్తువులైన వెదురు, జనపనార, ఇతర అటవీ ఉత్పత్తులపై అవగాహన పెంచాలని కోరింది. పండగలు, ఉత్సవాల సందర్భంగా ప్లాస్టిక్ వాడకం మితీమిరుతోందన్న విషయాన్ని కేంద్ర పర్యావరణ శాఖ గర్తుచేసింది. అడవులు, వాటి ప్రాముఖ్యతల ప్రదర్శన, ప్లాస్టిక్ కాలుష్యంపై స్కూలు పిల్లలతో పెయింటింగ్, డ్రాయింగ్ పోటీల నిర్వహణ నిర్వహిస్తారు. అటవీ రక్షిత ప్రాంతాలు, అర్బన్ ఫారెస్ట్ పార్కుల్లో ప్లాస్టిక్ ఫ్రీ డ్రైవ్‌ల నిర్వహణ, నేషనల్ పార్కులు, జూ, సాంక్చురీలను ప్లాస్టిక్ రహిత ప్రాంతాలుగా ఏర్పాటుచేయటానికి కృషి చేయాలన్నారు. జాతీయ స్థాయిలో ఫిక్కీ (ఎఫ్ఐసీసీఐ) ఈ కార్యక్రమాలను అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించాలని క్షేత్ర స్థాయి అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది.

## బంగాళాఖాతంలో వాయుగుండం

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుంది. మరో వైపు బంగ్లాదేశ్ సమీపంలో వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్‌కు 170 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ వాయుగుండం ప్రభావం ఉత్తర, దక్షిణ కోస్తాలపై ఉండదని, రాష్ట్రంపై పెద్దగా ప్రభావం చూపించదని అధికారులు తెలిపారు. వర్షాలు కురిస్తే నైరు రుతుపవనాల గమనం ఆశాజనకంగా ఉంటుందని తెలియజేశారు.

## రాజధాని వార్తలు కలం

# ప్లాస్టిక్ రహిత ప్రపంచం

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ప్రతి ఏడాది జూన్ 5న జరుపుకుంటున్నాం. పర్యావరణానికి అనుకూలమైన చర్యలు తీసుకోవడానికి దీనిపై అవగాహనను పెంచడానికి ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం కార్యక్రమాలు నిర్వహిస్తోంది. 1972 జూన్ 5 నుంచి 16 వరకు మానవ పర్యావరణంపై ఐక్యరాజ్యసమితి సమావేశమై పర్యావరణ దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించారు. 1973లో మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకున్నారు. ఈ ఏడాది ఈ కార్యక్రమానికి భారత దేశం ఆతిథ్యం ఇస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా ఏడాదికి 500 బిలియన్ ప్లాస్టిక్ బ్యాగులను వాడుతున్నారు. ఇందులో 8 మిలియన్ టన్నులు సముద్రంలో చేరుతోంది. అంటే నిముషానికి ట్రక్ ప్లాస్టిక్ వ్యర్థాలు సముద్రంలో చేరుతున్నాయి. గత శతాబ్దం అంతటి కంటే ఒక దశాబ్దంలో వినియోగించిన ప్లాస్టిక్ ఎక్కువగా ఉంది. ఉత్పత్తిలో 50 శాతం ప్లాస్టిక్‌ను ఒక్కసారి మాత్రమే వినియోగిస్తున్నారు. ప్రతి క్షణం ఈ భూగోళంపై 1 మిలియన్ ప్లాస్టిక్ బాటిళ్లు కొంటున్నారు. వ్యర్థాల్లో 10 శాతం ప్లాస్టిక్‌దే. అందువల్ల 2018లో ప్లాస్టిక్ కాలుష్యంపై దృష్టి పెట్టారు.

ప్రపంచ పౌరులంతా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలని ఐక్యరాజ్యసమితి పర్యావరణ ప్రధాన కార్యదర్శి ఎరిక్ సోలి హిమ్ పిలుపు నిచ్చారు. అంతులేని ప్లాస్టిక్ వినియోగంతో సముద్రాలతో సహా భూగోళం అంతా కాలుష్యమయిపోతున్న ఈ తరుణంలో ప్లాస్టిక్ రహిత ప్రపంచానికి కృషి చేయాల్సిన అవసరం ఉంది. భారతీయ సాంప్రదాయం ప్రకృతితో మమేకమయ్యే జీవన విధానానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అయితే ప్రస్తుతం వాయు, శబ్ద, పర్యావరణ కాలుష్యాలు ధరిత్రిలోని జీవరాశిపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ప్లాస్టిక్ బదులుగా, గుడ్డ, నార సంచులు, వస్తువులు వాడకాన్ని పెంచాలి. భారత ప్రభుత్వం పర్యావరణ పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టింది. చెరువుల నుంచి సముద్రం వరకు అన్నింటిని ప్లాస్టిక్ రహితంగా చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. అపరిమిత ప్లాస్టిక్ వినియోగంతో సముద్ర జలాల తీవ్ర కాలుష్యానికి గురై సముద్ర జీవరాశులు జీవన్మరణ సమస్యను ఎదుర్కొంటున్నాయి. పరిశ్రమల వ్యర్థాలతో నదులు తీవ్ర కాలుష్యం బారిన పడుతున్నాయి. దీనిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు స్వచ్ఛంద సంస్థలతో కలసి తక్షణమే చర్యలు చేపట్టాలి. జాతీయ అటవీ పరిధిని పెంచి ప్లాస్టిక్ ఉత్పత్తులను తగ్గించి, దేశాన్ని ప్లాస్టిక్ రహితంగా చేయడానికి పౌరులను సమాయత్తం చేయాలి. ప్రతి ఒక్కరినీ భాగస్వామ్యులను చేసే కార్యక్రమాలు రూపొందించి వాతావరణ కాలుష్యంపై అవగాహన కలిగించాలి. ఇందుకోసం దేశవ్యాప్తంగా బీచ్‌లు, నది ఒడ్డున ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించడానికి కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అంతేకాకుండా ప్రపంచ పర్యావరణానికి భారతదేశం మార్గనిర్ధేశకత్వం జరుపుతోంది. ప్లాస్టిక్ నుంచి మనం నివసించే భూగోళాన్ని రక్షించుకుని, భావిపౌరులకు సుందర ప్రపంచాన్ని అందించడం మనందరి బాధ్యత. దీనిపై ప్రతి ఒక్కరం కృషి చేద్దాం.

నాలుగేళ్లలో ఆయన మనకి ఎన్నో ఇచ్చాడు, ఎంతో లాక్కున్నాడు.. వచ్చే 2019 ఎన్నికల్లో ఆయనకి ఏదైనా తిరిగి ఇచ్చేయాలి. ఆయన చాయ్ బండీ ఆయనకి ఇచ్చేద్దాం.. లేకపోతే మనం అడుక్కుతినిపోతాం...



## మహిళా ఫిర్యాదులకు ప్రత్యేక వెబ్‌సైట్

**రాజధాని ప్రతినిధి, తిరుపతి :** తిరుపతి ఎస్.వియూనివర్సిటీ సెనెట్ హాల్ నందు తిరుపతి అర్బన్ పోలీస్ వారు ప్రతిష్ఠాత్మకంగా మహిళల కోసం ఒక ప్రత్యేకమైన shebot వెబ్ అప్లికేషన్ (www.shebot.co.in) ను తిరుపతి అర్బన్ ఎస్పీ అభిషేక్ మహంతి, ఎస్.వి.యు. వైస్ చాన్సలర్ దామోదర్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎస్పీ మాట్లాడుతూ జిల్లా పరిధిలో అనేక యూనివర్సిటీలు మరియు డిగ్రీ కాలేజీలు జూనియర్ ఇంటర్ కాలేజీలు వున్నాయని ఇందులో చదువుతున్న విద్యార్థినులకు, ఇతర మహిళా సిర్బందికి బయటకు చెప్పని ఎన్నో సమస్యలు వుంటాయని పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయుటకు, ఒక వేళ ఫిర్యాదు చేసినా జరిగిన అనర్థాలు బయటకు చెప్పటనికి ఇబ్బంది పడుతుంటారని, వీరు పోలీస్ స్టేషన్‌కు వెళ్ళలేని పరిస్థితుల్లో పోలీస్ వారికీ తెలియజేసే విధంగా తద్వీరా ప్రాథమిక సహాయాన్ని ప్రతి మహిళ పొందేవిధముగా అందించే ఉద్దేశ్యంతో తిరుపతి అర్బన్ పోలీస్ వారు shebot ను ప్రారంభించడం జరిగింది. ఈ టీంమ్ నందు ట్రాఫిక్ డిఎస్పిలు సుకుమారి గారు, కాటమరాజు, సుధాకర్ రెడ్డి గారు, సి.ఐ. హేమలత గారు మరియు సిబ్బంది వుంటారు, ముఖ్యంగ ఎస్.వి.యూనివర్సిటీ నందు ప్రారంభిచడానికి కారణము ఇక్కడ ప్రారంభిస్తే ఇక్కడ వున్న య విద్యార్థులద్యారా త్వరితగతిగా మహిళలందరికి వెబ్ అప్లికేషన్ యొక్క వివరాలు తెలుస్తాయని తెలియచేశారు. ఇది తిరుపతి వరకే పని చేస్తుంది. యూనివర్మిటీ ఎస్. వియూనివర్మిటీ రిజిస్టర్ అనురాధ, తిరుపతి అడ్మిన్ అడిషనల్ ఎస్పి శ్రీనివాసులు, తిరుమల అడిషనల్ ఎస్పీ మురళికృష్ణ, ఎస్‌బిడిఎస్‌పి రవిమనోహర చారి, వెస్ట్ డిఎస్ పి కానకరాజు, షీటీమ్ సిబ్బంది పాల్గొన్నారు. ఇటువంటి యాప్‌ను అమరావతిలో కూడా ఏర్పాటుచేయాలని రాజధాని ప్రాంత మహిళలు కోరుకుంటున్నారు.

## జూన్‌లో ఆంధ్రాఫుడ్ ఫెస్టివల్

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** వచ్చేనెలలో ఆంధ్ర ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించనున్నామని. దీనికి తగిన ప్రచారం కల్పించాలని అధికారులను పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేశ్ కుమార్ మీనా ఆదేశించారు ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ కోసం అత్యంత పొడవైన పూతరేకును తయారు చేయించాలని సూచించారు సచివాలయంలో టూరిజం అథారిటీపై ఆయన సమీక్ష నిర్వహించారు. తెలుగు వంటకాలపై ప్రతి నెల ఒక కార్యక్రమం ఉండాలని, ఇందుకోసం క్యాలెండర్ రూపొందించాలని ఆదేశించారు. గండికోటను జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిర్దేశిత కాల వ్యవధి నిర్ణయించాలని సూచించారు.

## బ్యాంకులపై ముద్రా బండ

# 14 వేల కోట్లకు పైగా టోపీ..!

- నిరర్థక ఆస్తులుగా మారనున్నట్టు అంచనా..!!
- లబ్ధిదారుల్లో అధికభాగం బీజేపీ కార్యకర్తలే..?




**న్యూఢిల్లీ :** చిన్న, మధ్యతరగతి వ్యాపారులకు సులభ రుణాలను అందించే లక్ష్యంతో 2015, ఏప్రిల్ 8న మోడీ ప్రభుత్వం ప్రధానమంత్రి ముద్రా యోజన(పీఎంఎంవై) పేరుతో ద్రవ్య పథకాన్ని ప్రారంభించింది. దేశంలో ఉద్యోగావకాశాలను పెంచే ఉద్దేశంతో తాను ఈ పథకాన్ని ప్రారంభిస్తున్నట్టు ప్రధాని మోడీ ఎంతో గొప్పగా ఈ పథకం గురించి ప్రచారం చేసుకున్నారు. కానీ, కేంద్ర ప్రభుత్వం మొద్దు నిద్ర వల్ల రుణాలు మంజూరు చేసిన బ్యాంకులకు ఈ పథకం పెద్ద తలనొప్పిగా తయారైంది.

ఈ పథకం కింద మోడీ ప్రభుత్వం అ మూడేండ్లలో సుమారు రూ.5 లక్షల కోట్లను రుణాలుగా మంజూరు చేసింది. ఈ 5 లక్షల కోట్లు ఇచ్చినట్టు ప్రధాని మోడీ చెబుతున్నారు. కానీ, మంజూరైన రుణాల్లో 14 వేల కోట్లకుపైగా నిరర్థక ఆస్తులు (ఎన్‌పీఏ)గా మారే ప్రమాదమున్నదని జాతీయ మీడియా పరిశోధనలో వెల్లడైంది. ఎన్‌పీఏలు మరింత పెరిగే అవకాశమున్నట్టు అంచనా. అయితే, ఆర్థికశాఖ దీనిని ధ్రువీకరించలేదు. ఎలాంటి హామీలు లేకుండా ఇస్తున్న ఈ రుణాలను అర్హులైన లబ్ధిదారులకు అందిస్తే ఎవరూ విమర్శించేవారు కాదు. కానీ, ఈ రుణాలు పొందుతున్నవారిలో అధికభాగం కేంద్రంలోని అధికార పార్టీ )బీజేపీ) కార్యకర్తలేనని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. ఈ పథకం కింద 2017-18లో రూ.1.81 లక్షల కోట్లు మంజూరు కాగా, రూ.1.75 లక్షల కోట్లకు ఆమోదం లభించింది. ఈ పథకం కింద గతేడాఇ కేటాయించిన మొత్తం కేంద్ర ప్రభుత్వ రుణా ప్రణాళికా లక్ష్యమైన రూ.2.44 లక్షల కోట్లకు దగ్గరగా ఉండటం గమనార్హం. మూడేండ్ల క్రితం ప్రధాని మోడీ ప్రకటించిన ఈ పథకం కింద మూడు రకాల రుణాలను మంజూరు చేస్తారు. అవి: బాల్య రుణాలు(రూ.50,000 వరకు), టీనేజ్ రుణాలు (50,000 నుంచి రూ.5 లక్షల వరకు), చిన్న మొత్తం రుణాలు (రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు).. ఈ పథకం కింద మంజూరు చేసే సూక్ష్మ, చిన్న, మధ్య తరహా రుణాల విషయంలో ఎలాంటి హామీలూ ఇవ్వాల్సిన అవసరం లేదు. ఈ పథకం ద్వారా దేశంలో అత్యధిక ఉద్యోగావకాశ్యాలు కల్పించడమే తమ లక్ష్యమని మోడీ ప్రభుత్వం ప్రచారం చేసుకున్నది. ఈ పథకం కింద రుణాల మంజూరుకు ప్రభుత్వరంగ బ్యాంకులతోపాటు నాన్ బ్యాంకింగ్, సూక్ష్మ ఆర్థిక సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఎంచుకున్నది. 2017-18లో ఈ పథకం కింద 4 కోట్ల 3 లక్షల 89వేల 854 మందికి రుణాలను మంజూరు చేసింది. రుణాలలో 75 శాతం మహిళలకు ఇవ్వాలని ఓ నిబంధన ఉన్నది. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు 50 శాతం రుణాలు కేటాయించాలని మరో నిబంధన ఉన్నది. ఓ వైపు రుణాల మంజూరులో పారదర్శకత లోపించడం, అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయకుండా రాజకీయ పలుకుబడి ఉన్నవారికి అవకాశం కల్పించడంతో ఈ పథకం అమలు తీరుపై తీరవ విమర్శలున్నాయి.

మరోవైపు ప్రభుత్వరంగ బ్యాంకులు మొండి బకాయిలతో కుదేలవుతున్న విషయం తెలిసిందే. పీఎస్‌బీలను ఎన్‌పీఏల నుంచి కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడిది బడ్జెట్ సందర్భంగా రూ.2.11 లక్షల కోట్ల పునర్ ధనీకరణను ప్రకటించింది. ముద్రా రుణాల విషయంలో కేంద్రం వక్రబుద్ధితో వ్యవహరిస్తోందని ఇప్పటికే పలు విమర్శలు వచ్చాయి. లక్షల కోట్ల ప్రజా ధనాన్ని సంక్షేమ పథకాల పేరుతో తమవారికి దోచి పెట్టే అధికారాన్ని ఏ రాజ్యాంగం వీరికిచ్చిందని పలువురు ప్రశ్నిస్తున్నారు. పీఎంఎంవై కింద ఈ మూడేండ్లలో మోడీ ప్రభుత్వం రూ.4 లక్షల 68 వేలకోట్లను 9 కోట్ల 92 లక్షలమందికి రుణాల పేరుతో అందజేసింది.

## ఐపీఎల్ బెట్టింగ్ స్కామ్‌లో సల్మాన్ సోదరుడు

**ముంబై :** సల్మాన్‌ఖాన్ సోదరుడు, నిర్మాత అర్బాజ్ ఖాన్ వివాదంలో చిక్కుకున్నారు. ఇటీవల జరిగిన ఐపీఎల్ మ్యాచుల్లో అర్బాజ్ బెట్టింగ్‌లకు పాల్పడ్డారన్న ఆరోపణలు వస్తుండటంతో మహారాష్ట్రలోని థానే పోలీసులు ఆయనకు సమన్లు జారీ చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన సోనూ జలన్‌ను రెండు రోజుల క్రితం పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో సోనూ.. అర్బాజ్ పేరు చెప్పడంతో విచారుణకు హాజరు కావాల్సిందిగా పోలీసులు ఆయనకి సమన్లు జారీ చేశారు. 'దబాంగ్', 'దబాంగ్ 2' చిత్రాల్లో అర్బాజ్ విలన్ పాత్రలు పోషించారు. సల్మాన్ నటించిన పలు చిత్రాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. తెలుగులో మెగాస్టార్ చిరంజీవి నటించిన 'జై చిరంజీవ' చిత్రంలో అర్బాజ్ విలన్ పాత్ర పోషంచారు. ఈ వార్తలపై సల్మాన్, అర్బాజ్ ఇప్పటి వరకూ స్పందించలేదు.

## పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలి

**రాజధాని ప్రతినిధి, తిరుపతి :** పెట్రోల్, డీజిల్‌ను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన రార్యదర్శి పి.మురళి డిమాండ్ చేశారు. పెట్రోల్, డీజిల్‌లను జీఎస్టీ పరిధిలోకి తేవాలని తిరుపతి ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో టాటా ఏస్ వాహనాన్ని దాళ్లతో లాగి నిరసన తెలిపారు. అనంతరం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మురళి మాట్లాడుతూ, పెట్రోలు, డీజిల్ ధరలను కేంద్ర ప్రభుత్వం తగ్గించకుంటే రాబోయే ఎన్నికల్లో రవాణారంగ కార్మికులు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ ఈ నాలుగు సంవత్సరాల కాలంలో ఎన్‌డీఏ ప్రతిరోజూ డీజిల్ పై భారాలు మోపుతూ సామాన్య ప్రజలను మోసం చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ కార్యదర్శి ఎన్.శివ, కె.వై .రాజా, రాధాకృష్ణ, విష్వనాథం పాల్గొన్నారు.

# ఆర్థిక నగరాలతో యువతకు ఉపాధి

**రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్**

**రాజధాని ప్రతినిధి, సచివాలయం :** రాష్ట్రంలో ఏర్పాటుకానున్న ఆర్థిక నగరాలతో యువతకు భారీ ఎత్తున ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దినేష్ కుమార్ అన్నారు. సచివాలయంలోని తన కార్యాలయంలో ఆర్థిక నగరాల ప్రగతిపై సమీక్షా సమావేశం శుక్రవారం నిర్వహించారు. ముందుగా రాష్ట్రంలో ఏర్పాటు చేయబోయే ఆర్థిక నగరాలపై ఏపీ టిడ్కో ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ రామనాథ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా సీఎస్ కు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 22 ఆర్థిక నగరాలు ఏర్పాటు చేయబోతున్నట్లు ఆయన తెలిపారు. వాటిలో 33 ప్రాజెక్టులకు నెలకొల్పేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జక్కంపూడి ఎకానమిక్



మాట్లాడుతున్న దినేష్ కుమార్


సహా మరో 6 నగరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడిదారులు ముందుకొచ్చారన్నారు. ఏయే జిల్లాల్లో ఏయే పరిశ్రమలు ఏర్పాటు చేస్తున్నారో సీఎస్ దినేష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. జక్కంపూడి ఆర్థిక నగరం కోసం అవసరమైన భూముల సేకరణకు సంబంధిత జిల్లా కలెక్టర్ తో చర్చించాలన్నారు. జక్కంపూడి తరహాలో ఆరు నగరాల్లో ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి చేయాలని ఆదేశించారు. ఆర్థిక నగరాల ఏర్పాటుతో యువతకు భారీఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. అయితే, పరిశ్రమల ఏర్పాటులో ప్రజాభీష్టాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. కాలుష్య రహిత పరిశ్రమలను ఆర్థిక నగరాల్లో ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. చిన్న, మధ్యతరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహమందించాలన్నారు. ఆయా ప్రాంతాల అవసరాలకనుగుణంగా పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఉద్యోగాల కల్పన ఎంత ముఖ్యమో ప్రజారోగ్యం అంతకంటే ఎక్కువని స్పష్టం చేశారు. ఆర్థిక నగరాల్లో పరిశ్రమల ఏర్పాటు కోసం ఆంధ్రప్రదేశ్ ఎకానమిక్ సిటీస్ ప్రమోషన్ కంపెనీ లిమిటెడ్ పేరుతో సంస్థను ఏర్పాటు చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ, మౌలిక సదుపాయలు, పెట్టుబడుల ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ ను సీఎస్ దినేష్ కుమార్ ఆదేశించారు. ఈ సంస్థ ద్వారా ఆర్థిక నగరాల్లో పరిశ్రమల ఏర్పాటుకు విస్తృతమైన ప్రచారం చేపట్టాలన్నారు. అదే సమయంలో ప్రతినెలా పారిశ్రామిక ప్రగతిపై సమీక్షలు నిర్వహించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో పలుశాఖల ముఖ్యకార్యదర్శులు అజయ్ జైన్, సాల్మన్ ఆరోఖ్య రాజ్ తో పాటు ఆర్.టి.జి సీఈవో బాబు.ఎ తదితరులు పాల్గొన్నారు.

# పట్టిస్తే రూ.5కోట్లు!!

- నల్లకుబేరుల పని పట్టేందుకు ఐటీ శాఖ వ్యూహం
- సమాచారం ఇచ్చేవారికి భారీ పారితోషికం
- పన్నుల ఎగవేత వివరాలిస్తే రూ.50 లక్షల రివార్డు

**న్యూఢిల్లీ :** నల్లకుబేరుల భరతం పట్టేందుకు ఆదాయ పన్ను విభాగం బంపర్ ఆఫర్ ప్రకటించింది. బ్లాక్‌మనీ, బినామీ లావాదేవీల గురించి నిర్దిష్ట సమాచారమిచ్చే వారికి రూ.కోటి నుంచి రూ.5 కోట్ల దాకా పారితోషికం ఇవ్వనుంది. దేశ, విదేశాల్లోని ఆస్తులు, ఆదాయాలపై పన్నుల ఎగవేతకు సంబంధించి నిర్దిష్ట వివరాలు ఇచ్చే వారికి రూ.50 లక్షల దాకా బహుమానం అందించనుంది. ఈ దిశగా కేంద్రీయ ప్రత్యేక్ష పన్నుల బోర్డు (సీబీడీటీ) 'బినామీ లావాదేవీల సమాచారమిచ్చే వారికి పారితోషికి పథకం 2018'ని ఆవిష్కరించింది. దీని ప్రకారం బినామీ లావాదేవీలు, ఆస్తుల గురించి ఆదాయ పన్ను విభాగానికి సమాచారమిచ్చే వారికి రూ.కోటి దాకా పారితోషికం లభిస్తుంది. అదే, లెక్కల్లో చూపకుండా విదేశాల్లో దాచిన నల్లధనం గురించి ఉప్పందించిన వారికి రూ.5 కోట్ల దాకా బహుమతి లభిస్తుంది. విదేశ వేగులకు కూడా ఇది వర్తిస్తుంది. బినామీ లావాదేవిల నిరోధక చట్టం కింద చర్యలు తీసుకోతగిన లావాదేవీలు, ఆస్తులకు సంబంధించిన సమాచారాన్ని జాయింట్ లేదా అడిషనల్ కమిషనర్ స్థాయి అధికారులకు అందించవచ్చు. ప్రజలను ప్రోత్సహించేందుకే...

బినామీ లావాదేవీలు, ఆస్తులు.. వాటిపై ఆదాయాన్ని అందుకునే ఇన్వెస్టర్లు, లబ్ధిదారుల గురించి సమాచారమిచ్చేలా ప్రజలను ప్రోత్సహించేందు ఈ పథకాన్ని రూపొందించినట్లు సీబీడీటీ పేర్కొంది. 'బినామీ లావాదేవీల సమాచారమిచ్చే ఇన్ఫార్మన్ పారితోషక పథకం కింద బినామీ లావాదేవీలు, ఆస్తులతో పాటు వాటిపై వచ్చే ఆదాయాలు అందుకుంటున్న



వారి గురించి నిర్దిష్ట ఫార్మాట్‌లో.. ఆదాయ పన్ను విభాగం ఇన్వెస్టిగేషన్ డైరెక్టరేట్‌క్సలోని బినామీ నిరోధక యూనిట్లలో జాయింట్ లేదా అడిషనల్ కమిషనర్స్‌కి సమాచారమిస్తే వారికి రూ.1 కోటి దాకా పారితోషికం లభిస్తుంది.' అని సీబీడీటీ తెలిపింది.

**గోప్యంగా ఇన్ఫార్మర్ వివరాలు..**

బినామీ లావాదేవీలు, ఆస్తుల గురించి సమాచారమిచ్చే ఇన్ఫార్మర్ల వివరాలను గోప్యంగా ఉంచుతా మని సీబీడీటీ పేర్కొంది. బ్లాక్ మనీ చట్టం కింద.. లెక్కల్లో చూపకుండా విదేశాల్లో దాచిన నల్లధనం వివరాలు తెలియజేస్తే రూ.5 కోట్ల దాకా రివార్డు లభిస్తుందని సీబీడీటీ వివరించింది. మరొకరి పేరుపై నల్లధనాన్ని ప్రాపర్టీల్లో ఇన్వెస్ట్ చేస్తున్న సందర్భలు అనేకం ఉంటున్నాయని సీబీడీటీ తెలియజేసింది. ఆయా ఆస్తులు, లావాదేవీలు బినామీల పేరుపై జరిగినా ప్రయోజనాలన్నీ కూడా చాటుగా ఇన్వెస్టర్‌కే చేరుతున్నాయని పేర్కొంది. పన్ను రిటర్నుల్లో ఇలాంటి కనిపించకుండా వారు జాగ్రత్తపడుతున్నారని వివరించింది. ఇప్పటికే ఇందుకు సంబంధించి చట్టాన్ని మరింత పటిష్టంగా చేసే క్రమంలో బినామీ లావాదేవీలకు నిరోధించేలా చట్టాన్ని సవరించారు.

## రాయపూడిలో చంద్రన్న చలివేంద్రం ఏర్పాటు




**రాజధాని ప్రతినిధి, అమరావతి :** వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్నాయి. రోహిణీ కార్తె కూడా ప్రారంభమైంది. జనం దాహంతో అల్లాడిపోతున్నారు. ప్రజల దాహం తీర్చేందుకు రాయపూడిలో ఉన్న 30 డ్వాక్రాగ్రూపు సంఘాలవారు, వెలుగు పథకంవారు అధ్యర్వంలో దళిత వాడలో ప్రతిరోజు మినరల్ వాటర్ మరియు చల్లనిమజ్జిగ పంపిణీ చేస్తున్నారు.

## ఏపీపై సవతి తల్లిప్రేమను చూపిస్తున్నారు

**(మొదటిపేజీ తరువాయి)**

భవిష్యత్ కోసం ప్రధాని చుట్టూ, పార్లమెంటు చుట్టూ తిరిగానని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ప్రధాని గుండె కరగలేదని అందుకే ఎదిరించేందుకు ఎన్డీఏ నుంచి బయటకు వచ్చామన్నారు. రాష్ట్ర హక్కులు, ప్రయోజనాలు కాపాడుకునేందు ధర్మపోరాట దీక్ష చేస్తుంటే.. ఓ వైపు జగన్, మరోవైపు పవన్, ఇంకోవైపు సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణలు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని సీఎం విమర్శించారు. తెలుగుదేశం పార్టీ బలపడుతుందన్న భయంతోనే నియోజకవర్గాలను పెంచలేదని చంద్రబాబు ఆరోపించారు. కేంద్రం ఇవ్వకపోయినా పోలవరం ప్రాజెక్టులో 52 శాతం పనులు పూర్తయ్యాయని .. ప్రాజెక్టుకు ఇబ్బంది పెట్టొద్దని.. నిధులు ఇవ్వాలని ఆయన నవనిర్మాణ దీక్ష వేదికగా డిమాండు చేశారు.

# జీతాలు మహాప్రభో...

**(మొదటిపేజీ తరువాయి)**

సంస్థ ద్వారా ప్రతి బ్లాక్ లో 20 మంది చొప్పున 170 మంది హౌస్ కీపింగ్ సెక్షన్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అసెంబ్లీ భవనం, ముఖ్యమంత్రి ఉండే బ్లాక్ లో మాత్రం రెట్టింపు సంఖ్యలో హౌస్ కీపింగ్ వర్కర్లు విధులు నిర్వహిస్తుంటారు. కార్మిక చట్టాలను అనుసరించి రోజుకు 8 గంటల పనివిధానంతోపాటు పీఎఫ్,ఈఎస్.ఐ సౌకర్యం కల్పించి, విధులు నిర్వహించే సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తకుండా కాంట్రాక్టర్లు వారిబాగోగులు పట్టించుకుకోవాలి. అయితే వీటిలో ఏ ఒక్కటి సక్రమంగా అమలు జరగటం లేదు. ఉదయం 8 గంటలకు విధులకు వస్తే సాయంత్రం 6 గంటల తర్వాత ఇంటికి వెళు తున్నారు. అంటే 10 గంటల పాటు వీరు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నారు. ఇస్తున్న రూ. 8 వేల వేతనంలో పీఎఫ్,ఈ.ఎస్.ఐ పేరిట కోతలు విధిస్తున్నారు. కానీ నేటికీ వారికి పీఎఫ్, ఈ.ఎస్.ఐలు లేవు. పైగా నెలకు నాలుగు ఆదివారాల సెలవుల పేరుతో జీతాల్లో కోత వేస్తున్నారని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనం సక్రమంగా ఇవ్వకపోగా అడిగితే చీత్కారాలు, చివాట్లు ఎదుర్కొవాల్సి వస్తుందని, మూడు నెలలకొకసారి వచ్చే జీతంతో పస్తులుండాల్సి వస్తుందని కన్నీటి పర్యంతమవుతున్నారు. కాంట్రాక్టరుతో పాటుగా సూపర్ వైజర్లు రావే.. పోవే.. అంటూ చెప్పుకోలేని అసభ్య పదజాలంతో మానసికంగా హింసిస్తున్నారని వారు కుమిలి పోతున్నారు. జీతాలు చెల్లించాలని అధికారులకు కాంట్రాక్టర్‌కు తెలియచేస్తామన్నా, ధర్నా చేపడతామన్నా సదరు కాంట్రాక్టర్ ఉద్యోగాల నుంచి తొలగిస్తామని బెదిరిస్తున్నాడని ఉద్యోగులు వాపోతున్నారు. చాలీ చాలని జీతాలతో రోజులు నెట్టుకొస్తున్న తమకు నాలుగు నెలలు జీతాలు ఇవ్వకుంటే పిల్లలను ఎలా పోషించుకోవాలని రాజధాని వార్తలతో గోడు వెళ్లబోసుకున్నారు. రోజుకు రూ.250 మాత్రమే ఇస్తున్నారని, ఒకవేళ సెలవు తీసుకుంటే రూ.300 కట్ చేస్తున్నారన్నారు. 10 గంటల పాటు విధులు నిర్వహించే తాము భోజనం విరామం సమయంలో తప్ప మిగిలిన సమయమంతా నిలబడి ఉండాల్సిందేనని వివరించారు. అసంఘటిత కార్మిక సంఘాల్లో చేరుతామన్నా కాంట్రాక్టర్ బెదిరిస్తున్నాడన్నారు. పంటపొలాలను ప్రభుత్వానికి ఇచ్చి ,జీవనోపాధిని పోగొట్టుకొని కాంట్రాక్టర్ చేతిలో నానా బాధలు, అవమానాలు పొందుతున్నామన్నారు.

**కొరవడిన సీఆర్డీఏ పర్యవేక్షణ**

కార్మికుల చట్టం ఉల్లంఘన జరుగుతున్న పట్టించుకోక పోవటం సీఆర్డీఏ నిర్లక్ష్యానికి నిదర్శనంగా కనిపిస్తుంది. ఇప్పటికి నాలుగు నెలల వేతనాలు బకాయిలు ఉన్నారంటే సదరు కాంట్రాక్టురు పట్ల సీఆర్డీఏ ఎంతటి విధేయత ప్రదర్శిస్తుందో అర్థం చేసుకోవచ్చు. గట్టిగా ప్రశ్నించిన కార్మికులు ఇంటి బాట పట్టివ్వడం వీరికి రివాజుగా మారింది. ముఖ్యమంత్రి ఈ విషయంలో జోక్యంచేసుకొని జీతం బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా చర్యలు చేపట్టాలని మహిళాకార్మికులు కోరుతున్నారు.

# ఐర్లాండు మహిళా విజయం

ఆమె

**ప్రజారోగ్య రంగంలో ఎంతో ముందున్న దేశాలు సైతం మహిళా ఆరోగ్యం విషయంలో మాత్రం కఠిన నియమాలను అమలు చేస్తూ వారి జీవితాలను దుర్భరం చేస్తున్నాయి.** మహిళల ఆరోగ్య విషయంలో ఐర్లాండు క్రైస్తవ కేథలిక్కు ప్రభుత్వం తల్లికి, గర్భస్థ శిశువుకు ఒకే చట్టాన్ని అమలు చేయడంతో మహిళలు ప్రాణాలు కోల్పోతున్నారు. దీని విషయంలో అక్కడి ప్రజలు చేసిన సుదీర్ఘ పోరాటం ఫలితాలను ఇచ్చింది.




కేరళకు చెందిన దంతవైద్యురాలు సవిత తన భర్తతో కలసి ఐర్లాండులోని గ్వాలేలో స్థిరపడ్డారు. 2012లో అక్టోబరు 21న నడుంనొప్పితో ఆసుపత్రిలో చేరారు. ఆమె ఆరోగ్యాన్ని పరీక్షించిన డాక్టర్లు ఆమెకు అబార్షన్ చేయాలని నిర్ణయించారు. అయితే గర్భస్థ శిశువు గుండె కొట్టుకోవడంతో డాక్టర్లు అబార్షన్‌ను చేయలేకపోయారు. రాజ్యాంగంలోని ఎనిమిదవ సవరణ ప్రకారం తల్లిబిడ్డలకు జీవించే హక్కు ఉండటంతో అబార్షన్ సాధ్యంకాలేదు. అదే సమయంలో ఆమెకు గర్భానికి ఇన్‌ఫెక్షన్ సోకి ఆరోగ్య పరిస్థితి విషమించింది. దీంతో యుద్ధ ప్రాతిపధికన ఆమెకు మందులతో డాక్టర్లు అబార్షన్ చేశారు. అప్పటికే ఆలస్యం కావడంతో అక్టోబర్ 28న ఆమె మృతి చెందింది. ఆమె మృతితో ఆదేశంలో యువత మేల్కొంది. అప్పటి నుంచి మహిళలు అబార్షన్ హక్కును కలిగి ఉండటానికి నిరంతరం పోరాటాలు చేశారు. దీంతో ప్రభుత్వం దిగి వచ్చి ప్రజాభిప్రాయ సేకరణ (రిఫరెండం) నిర్వహించింది. గత శుక్రవారం దేశంలోని 4 కోట్ల 80 లక్షల మంది జనాభాలో 69 శాతం మంది అబార్షన్లకు చట్టబద్ధత కల్పించాలని ఓట్లు వేశారు. ఇది ఆ దేశంలో నూతన శకానికి నాంది పలికిందని చెప్పవచ్చు.

దేశంలోని క్యాథలిక్ చర్చి ఆదేశాల ప్రకారం 1983లో చట్టాన్ని సవరించి తల్లీబిడ్డలకు జీవించే హక్కును కల్పించారు. అది ఇప్పటివరకు అమలులో ఉంది. దీని ప్రకారం దేశంలో అబార్షన్లు నిర్వహించే డాక్టర్లకు జీవితకాల శిక్ష విధించే అవకాశం ఉంది. దీంతో అక్కడి మహిళలంతా అబార్షన్ల కోసం ఇతర దేశాలకు వెళ్లేవారు. ఇది ఖర్చుతో కూడుకున్నది కావడంతో మధ్యతరగతి ఉద్యోగులంతా మరిన్ని గంటలకు ఎక్కువగా పనిచేసి డబ్బు సమకూర్చుకోవాల్సి వచ్చేది. అయితే ఖర్చులు భరించలేక ఒంటరిగా వెళ్లే మహిళలకు రక్షణ కరువవుతోంది. ఈ పరిస్థితుల్లో ఐర్లాండు ప్రభుత్వం ప్రజల కోరిక మేరకు అబార్షన్ల సౌకర్యాన్ని కల్పించడం ముదావహం. ప్రస్తుతం అబార్షన్ల చట్టానికి సవిత పేరే ప్రభుత్వం సూచిస్తోంది. ఇదే సమయంలో ఒక్కగానొక్క కుమార్తెను పోగుట్టుకున్న ఆమె తల్లితండ్రులు ఇప్పటికీ మనోవ్యథను దూరం చేసుకోలేకపోతున్నామని, తన కుమార్తెలా మరెవ్వరూ బలవకుండా ఉండటం సంతోషాన్ని ఇస్తోందన్నారు. అబార్షన్ల నిషేధంపై దేశంలో నిశ్శబ్ద విప్లవం వచ్చిందని భారత సంతతికి చెందిన ఐర్లాండు ప్రధాని లియో వరద్కర్ వెల్లడించారు.

## కాలమ్

### ప్రస్తుత నిజాలు

- గుడికి వెళ్లే మగవాళ్ల సంఖ్య,
  జిమ్ కు వెళ్లే ఆడవాళ్ల సంఖ్య క్రమంగా పెరుగుతుంది.
- అనాధ ఆశ్రమంలో పేదవారి చిన్నపిల్లలు ఉంటారు!
  వృద్ధా ఆశ్రమంలో ధనికుల తల్లిదండ్రులు ఉంటారు!!
- మనం సంతోషంలో ఉన్నపుడు పాటలను వినాలి!
  బాధలో ఉన్నపుడు ఆపాటలను అర్థం చేసుకోవాలి!!
- చచ్చిపోతున్నా కూడా వైద్యం చేయనివి గవర్నమెంటు ఆసుపత్రులు!
  చచ్చిపోయినాక కూడా వైద్యం చేసేవి కార్పొరేట్ ఆసుపత్రులు!!
- లేనోడు 'నోటి'తో మాట్లాడతాడు!
  ఉన్నోడు "నోటు"తో మాట్లాడతాడు!!
- చిరునవ్వు చాలావరకు సమస్యలు పరిష్కరిస్తుంది!
  మౌనం అసలు సమస్యలే రాకుండా నివారిస్తుంది!!
- పూజలుచేసి దేవుడికోసం మనం వెతుకుతాం!
  దానంచేస్తే ఆయనే మనకోసం వెతుక్కుంటూ వస్తాడు!!
- నువ్వు అర్థం అవ్వట్లేదు అంటే...వాళ్ళకి నువ్వు అవసరం లేదు అని అర్థం!
  నీ మాటలు అర్థం కావట్లేదు అంటే నిన్ను పరిగణలోకి తీసుకున్నదే లేదు అని అర్థం!!
- తినటానికి భోజనం లేని స్థాయి నుంచి, తినడానికి సమయమే లేని స్థాయి వరకు ఎదగటమే "విజయం".

# చురుగ్గా నైరుతి రుతుపవనాలు

**వారంలోగా రాష్ట్రానికి...**
**బంగాళాఖాతంలో వాయుగుండం**

**రాజధాని ప్రతినిధి, విశాఖ :** నైరుతి రుతుపవనాలు చురుగా కదులుతున్నాయి. ఇప్పటికే కేరళలో ప్రవేశించిన రుతుపవనాలు మరో వారం రోజుల్లో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉన్నట్లు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ రుతుపవనాల వల్ల కేరళలో కురిసే వర్షాన్ని బట్టి మరింత చురుగ్గా కదిలి రాష్ట్రంలోకి త్వరగా ప్రవేశించే అవకాశాలున్నాయి. వాతావరణం అనుకూలించకపోతే మరితం ఆలస్యం అవకాశం లేకపోలేదు. కేరళ రాష్ట్రంలో విస్తరిస్తేగానీ, రాష్ట్రంలోకి ఎప్పుడు ప్రవేశించేది చెప్పలేమని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటికే అక్కడ వర్షాలు కురుస్తుండడం వల్ల రుతుపవనాల్లో కదలిక వచ్చి వీలునంతత్వరగా రాష్ట్రంలోకి వస్తాయని అధికారులు అంచనా వేస్తున్నారు. వాస్తవానికి రాష్ట్రంలో జూన్ 19 తరువాత ప్రవేశించాల్సి ఉందని, అయితే ఈసారి కేరళ రుతుపవనాలు ముందుగానే తాకటంతో వారం పది రోజుల్లోనే రాష్ట్రంలో ప్రవేశించే అవకాశం ఉందంటున్నారు.

**బంగాళాఖాతంలో వాయుగుండం**

తూర్పు మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతుంది. మరో వైపు బంగ్లాదేశ్ సమీపంలో వాయుగుండం ఏర్పడినట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బంగ్లాదేశ్‌కు 170 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ వాయుగుండం ప్రభావం ఉత్తర, దక్షిణ కోస్తాలపై ఉండదని, రాష్ట్రంపై పెద్దగా ప్రభావం చూపించదని అధికారులు తెలిపారు. వర్షాలు కురిస్తే నైరు రుతుపవనాల గమనం ఆశాజనకంగా ఉంటుందని తెలియజేశారు.

# భజరంగ్ దళ్ కేడర్‌కు ఆయుధ శిక్షణ

- చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోరాదు : బీజేపీ
- ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకోవాలి :కాంగ్రెస్

**రాజ్‌ఘర్ :** భజరంగ్‌దళ్ తమ కార్యకర్తలకు రహస్యంగా ఆయుధ శిక్షణ ఇచ్చింది. మధ్యప్రదేశ్‌లోని రాజ్‌ఘర్ జిల్లా బావరాలో 3వ తేదీ నుంచి 11 వరకూ 32 జిల్లాల నుంచి ఎంపిక చేసిన కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చింది. సంఘం విద్రోహ శక్తులను,లవ్ జిహాద్ శక్తులను ఎదుర్కొనుందుకుగాను రైఫిళ్లు, కత్తులు, లాఠీలు వంటి ఆయుధాలను ఉపయోగించడాన్ని, కరాటే,షూటింగ్, చెట్లు, తాళ్లు, టవర్లు ఎక్కడం, హైజంప్ చేయడం వంటి వాటిలో నేర్పింది. ఈ ప్రత్యేక శిక్షణ ఎంపికై, నయోదు చేసుకున్న అభ్యర్థులు క్యాంపు పూర్తి అయ్యేంత వరకు బయట అడుగుపెట్టేందుకు వీల్లేదు. రోజూ ఉదయం 4 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు వారికి అవసరమయేకయ అన్ని వసతలనూ భజరంగ్ దళ్ క్యాంపులో కల్పించింది. ట్రైనింగ్ సెషన్‌కు సంబంధించిన కొన్ని ఫోటోలు బయటకు రావడంతో ఈ ప్రత్యేక ఆయుధ శిక్షణ వ్యవహారం వెలుగుచూసింది. సంఘవిద్రోహ



శక్తులు, లవ్ జిహాద్ శక్తులను నిలువరించేందుకు ప్రతిఏటా నిర్వహించేలానే ఈ ఏడాది కూడా శిక్షణా శిబిరం ఏర్పాటు చేశామని, ఇది 1984 నుంచి కొనసాగుతున్న ప్రక్రియ అని భజరంగ్‌దళ్ జిల్లా కన్వీనర్ దేవిసింగ్ సోంధియా తెలిపారు.దీనిపై బీజేపీ స్పందిస్తూ.. చటాన్ని తమ చేతుల్లోకి తీసుకునేందుకు ఏ ఒక్కరిన్నీ అనుమతించేది లేదని పేర్కొంది. పార్టీ మధ్యప్రదేశ్ రాష్ట్ర అధికార ప్రతినిధి రజనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, 'దేశంలో న్యాయబద్ధ పాలన ఉంది. ఏ ఒక్కరు కూడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొనేందుకు వీల్లేదు.దీనిపై ప్రభుత్వం తగు విధంగా చర్యలు తీసుకుంటుంది' అని అన్నారు. బజరంగ్‌దళ్ ఆయుధ శిక్షణపై కాంగ్రెస్ కూడా ఘాటుగా స్పందించింది. ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండు చేసింది.కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పంకజ్ చతుర్వేది మాట్లాడుతూ ఈ విధంగా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొనేలా ఎవ్వరినీ అనుమతించరాదు. శిక్షణ తీసుకుంటున్న వారికి దేశసాయుధ దళాలపై నమ్మకం లేదా? ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి అని డిమాండు చేసింది.

# రాజధాని క్లాసిఫైడ్స్

## నివాస ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ :9440662699

**రాయపూడి**
రాజధాని ప్రాంతంలోని రాయపూడి గ్రామ పరిధిలో 500, 1000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్: 9440662699

## ఇతరములు

**తుళ్ళూరు**
ఎస్.ఎమ్(స్టైల్ ఫర్ మెన్) ట్రైలర్స్
ఫోన్ 9440307123

వెంకటపాలెం
సాయిలాస్య రియల్ఎస్టేట్ & ఫైనాన్స్ కన్సెల్టెన్సీ, గాదె నాగేశ్వరరావు
ఫోన్ : 951515393

**మందడం**
ఎస్.ఆర్.కె. గ్రాండ్ రెస్టారెంట్
ఫోన్ : 9553023388

**వెలగపూడి**
సాయి గణేష్ ట్రెడర్స్: నిర్మాణ రంగానికిసిమెంట్, స్టీలు, పైపులు, పెయింట్‌లు అమ్మబడును.
ఫోన్ : 9640811333

**రాయపూడి**
చంద్రిక ట్రెడర్స్ నిర్మాణ రంగానికి సిమెంట్, స్టీలు,పైపులు అమ్మబడును.
ఫోన్ : 9908073516

**రాయపూడి**
రియల్ఎస్టేట్ క్రయ,విక్రయాలకు సంప్రదించడం న్యూసింగపూర్ రియల్ ఎస్టేట్
ఫోన్ : 9848442436

**రాయపూడి**
కాకతీయ ఫుడ్ కోర్ట్
ఫోన్ 9848021898

## షాప్స్

**తుళ్ళూరు**
రేమాండ్స్ట్రైలర్స్
ఫోన్ : 9492470426

**రాయపూడి**
వర్షిత ఫోటోస్టాట్
ఫోన్ : 9985853188

**తుళ్ళూరు**
వైభవ్ డ్రస్సెస్
ఫోన్ : 9848407935

**తుళ్ళూరు**
రాజా గోల్డ్ కవరింగ్
ఫోన్ : 9581500500

**తుళ్ళూరు**
శ్రీసాయి జ్యూయలరీ వర్క్స్
ఫోన్ :9247171083

**రాయపూడి**
ఖాజా ఖాదర్ రైస్ స్టోర్స్
ఫోన్ : 9603990791

## హస్పటల్స్

**విజయవాడ**
ఆంధ్ర హస్పటల్, డా॥శ్రీమన్నారాయణ
ఫోన్ : 9177219900

**విజయవాడ**
ఇంధిరారావు మెడికేర్ (సెంటర్)
ఫోన్ : 9440421580

**విజయవాడ**
న్యూఫేస్ కీనిక్ , డా॥మేహబూబ్
ఫోన్ : 9849122788

**విజయవాడ**
అష్రఫ్ మెటర్నిటీ & ఇ,ఎన్‌టి డా॥ రెహమాన్
ఫోన్: 0866-2475087

**విజయవాడ**
శ్రీమానస సైకియాట్రిక్ డా॥ అయోధ్య ఆర్.కె
ఫోన్:0866-2436647

విశాఖపట్నం
చింతలూరు ఆయుర్వేద డా॥ విశ్వనాథ్
ఫోన్ :90329 90138

## వాణిజ్య ప్లాట్లు

**నవులూరు**
రాజధాని ప్రాంతంలోని నవులూరు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

**ఐనవోలు**
రాజధాని ప్రాంతంలోని ఐనవోలు గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9908244333

నీరుకొండ
రాజధాని ప్రాంతంలోని నీరుకొండ గ్రామ పరిధిలో 500, 1000, 2000 గజముల ప్లాట్లు కావలెను
ఫోన్ : 9440662699

## విద్యా సంస్థలు

ఐనవోలు
విఐటీ-ఏపీ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2370444

నీరుకొండ
ఎస్ఆర్ఎమ్ యూనివర్శిసిటీ
ఫోన్ :0863 2343000

గమనిక : క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/లేదా అతనిపై చట్టరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

- మేనేజర్

ప్రకటనలకు సంప్రదించండి 9493170689

## ఢిల్లీలో ఓ మాట..

# గల్లీలో మరోమాట



**రాజధాని ప్రతినిధి, విజయనగరం :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఢిల్లీలో ఓ మాట, రాష్ట్రంలో మరో మాట మాట్లాడుతున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సీఎంపై విరుచుకుపడ్డారు. జన పోరాట యాత్రలో భాగంగా విజయనగరం జిల్లాలోని సాలూరు, గజపతినగరం నియోజకవర్గాలలో పర్యటించారు. సాలూరులోని బోసు బొమ్మ జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పవన్ మాట్లాడుతూ రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో అధికార, ప్రతిపక్షాలు పని చేయడం లేదని, జనసేన లేకపోతే ఇప్పటికే ఊళ్ళుకు


**చంద్రబాబుపై పవన్ ఆరోపణ**

ఊళ్ళు పంచేసుకునేవారన్నారు. 2019లో జవాబుదారీ ప్రభుత్వాన్ని జనసేన ఏర్పాటు చేస్తోందన్నారు. రాష్ట్రంలో 17 వేల కిలోమీటర్లు రోడ్లు వేశామని లోకేష్ చెబుతున్నారని, కానీ వారికి సాలూరు ప్రజలు కోరుతున్న బైపాస్ రోడ్డు డిమాండు వినిపించలేదని పేర్కొన్నారు. సాలూరులో భంజదేవ్ గిరిజనుడు కాదని తెలిసినా ఇన్‌చార్జి ఇచ్చారని అన్నారు. ఆయన రిజర్వాయర్ నీటిని చేపల చెరువులకు పంపించి కలుషిత నీటిని ప్రజలకు ఇస్తున్నారని ఆరోపించారు. గనుల లీజులలో అధికార పార్టీ వారిదే హవా అన్ని అన్నారు. చంద్రబాబు ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ అంటున్నారని, కానీ గజపతినగరంలో చూస్తే పందులు స్వైర విహారం చేస్తున్నాయని ఎద్దేవా చేశారు. ప్రత్యేక హోదా వస్తే జిల్లాలో జూట్ ఫ్యాక్టరీలు మూతపడేవి కాదన్నారు. గజపతినగరం ఎమ్మెల్యే అధికారులపై జులుం ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. యువతకు జనసేన అండగా ఉంటుందని, ఉద్యోగాలు ఇస్తోందని హామీ ఇచ్చారు. అంగన్‌వాడీలకు సమయానికి వేతనాలు ఇస్తామన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. సాలూరు, గజపతి నగరంలలో పవన్ సభలలో అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిర్యాని ప్యాలెస్ ను సందర్శించిన

# శాసన మండలి చైర్మన్ ఫారుక్

**రాజధాని ప్రతినిధి, గుంటూరు :** గుంటూరు నగరానికి విచ్చేసిన శాసన మండలి చైర్మన్ యండి ఫారుక్ నగరంలోని ముస్లిం నాయకులు మత పెద్దలతో సమావేశం అయ్యారు ఈ సందర్భంగా పలువూరు ముస్లిం ప్రముఖులు స్థానిక సమస్యలు గురించి శాసనమండలి చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు అనంతరం ఆయన నగరంలో పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ఏర్పాటు చేసిన హలీమ్ వంటకాలను స్థానిక బిర్యాని ప్యాలెస్ లో రుచి చూశారు రుచి ఆయన స్థానిక మైనార్టీ కమీషన్ చైర్మన్ జియావుద్దీన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మహమ్మద్ హిదాయత్ లతో కలిసి ఐబిలో మైనార్టీ నేతలతో సమావేశం అయ్యారు అనంతరం పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకుని స్థానిక స్టేడియం సెంటర్‌లోని బిర్యానిప్యాలెస్ లో వంటకాలు గురించి తెలుసుకున్నారు అధ్యాత్మిక మాసం అయిన రంజాన్ నెలలో అత్యధిక శాతం మంది నిమమ నిష్టలతో పవిత్రంగా ఉపవాసాలు




ఉంటారని అలాంటి వారికి ఉపయోగపడే విధంగా బలవర్ధకమైన ఆహార పదార్థాలతో తయారు చేసే హలీమ్ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. రంజాన్ నెలలో అనుక్షణం అల్లా ..నామస్మరణతో గడుపుతుంటారని అన్నారు ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులు శాసనమండలి ఛైర్మన్ కు ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అన్వర్, ముఖ్తియార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# నవ నిర్మాణదీక్షలోగా పింఛన్ల పంపిణీ

**అధికారులను ఆదేశించిన సీఎం చంద్రబాబు..**

**రాజధాని ప్రతినిధి,అమరావతి :** నవనిర్మాణ దీక్ష లోపు పింఛన్ల పూర్తి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశించారు. ఉండవల్లిలోని తన నివాసంలో పంఛన్ల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. పెన్షన్ల ద్వారా లబ్ధిదారుల్లో 80% సంతృప్తి ఉందని చంద్రబాబు తెలిపారు. ఎంతమందికి పెన్షన్లు ఇస్తున్నారు, కొత్తగా ఎన్ని మంజూరు చేశారంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం 47,26.341 పెన్షన్లు ప్రతినెలా అందిస్తున్నట్లు అధికారులు వివరించారు. అయితే. కొత్తగా 2,54,736 మందికి పెన్షన్లు పంపిణీ చేయాలని చెప్పారు. కాగా 33,722మంది మత్స్యకారుల



పింఛన్లు వెంటనే అందజేయాలని చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు.మత్స్యకారులు పెన్షన్లకు మార్గదర్మకాలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ఏటా రూ .6వేల కోట్లు పైగా పింఛన్ల కోసం ఖర్చుస్తున్నామని సీఎం వ్యాఖ్యానించారు. ప్రతినెలా ఒకటో తుదీనే పింఛన్ల పంపిణీ జరిగేలా శ్రద్ధ పెట్టాలని ఆదేశించిరు. ఇందుకోసం నగదు కొరత లేకుండా చూడాలని చెప్పారు. సేవా దృక్ఫధంతో సంక్షోమ శాఖ యంత్రాంగం పనిచేయాలని.అవినీతికి తావు విధంగా పింఛన్ల పంపిణీ జరగాలని ఆదేశించారు.

## ప్రెస్‌కౌన్సిల్ సభ్యులుగా అమర్, మజీద్

**హైదరాబాద్ :** దేశంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (పీసీఐ) సభ్యులను ప్రకటించింది. దేశవ్యాప్తంగా వర్కింగ్ జర్నలిస్టుల కోటా నుంచి ఏడుగురిని ఎంపిక చేయగా, అందులో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ) నుంచి ఐదుగురికి స్థానం లభించింది. సభ్యుల్లో తెలంగాణ నుంచి టీయుడబ్ల్యూజే యూనియన్ నాయకులు దేవులపల్లి అమర్, మాజిద్ ఎంపికయ్యారు. ప్రెస్ కౌన్సిల్ ఇఫ్ ఇండియా సభ్యులుగా దేవులపల్లి అమర్, మాజిద్‌కు అవకాశం లభించడంపై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం హర్షం వ్యక్తం చేసింది. వారికి టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి విరాహత్ అలీ శుభాకాంక్షలు తెలిపారు. రెండు రోజుల క్రితమే ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ అధ్యక్ష స్థానాన్ని అమర్ కైవసం చేసుకున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ జర్నలిస్టులకు ప్రస్తుతం మరో చక్కటి అవకాశం లభించిందని, దేశంలో, రాష్ట్రంలో సంఘానికి ఉన్న గుర్తింపు, ఆదరణకు ఇది నిదర్శనమని ఆయన అన్నారు.

## ఏపీలో 10 ఎక్సైజ్ చెక్‌పోస్టులు

**మరో నాలుగు జిల్లాల్లో నవోదయం : కెఎస్ జవహర్**

**రాజధాని ప్రతినిధి, అమరావతి :** రాష్ట్రంలో పది ఎక్సైజ్ చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నామని ఆ శాఖా మంత్రి కెఎస్ జవహర్ తెలిపారు. సచివాలయంలోని నాలుగో బ్లాక్ పబ్లిసిటీ సెల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విజయనగరం, విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల్లో వాటిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. సారా ఆధారిత వృత్తిగా చేసుకున్న కుటుంబాలను గుర్తించి వాటి నుంచి దూరం చేయడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. విశాఖజిల్లా కళ్యాణలో వద్ద 38.875 కిలోల గంజాయిని ధ్వసం చేశామని తెలిపారు. ఈ గంజాయిను 14 పోలీసు స్టేషన్ల ద్వారా పట్టుకుందన్నారు. గంజాయి రవాణా, సాగునకు పాల్పడిన వారిని జైలుకు పంపుతామని హెచ్చరించారు. బెల్టు షాపులకు సంబంధించి ఇప్పటివరకూ రాష్ట్ర వ్యాప్తంగా 7,526 మందిని అరెస్టు చేశామని, నలుగురిపై పీడీయాక్టు కేసులు నమోదు చేశామని వివరించారు.

## 16న ప్రధాని, ముఖ్యమంత్రుల భేటీ




**రాజధాని ప్రతినిధి, అమరావతి :** అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో జూన్ 16న దిల్లీలో నీతిఆయోగ్ ఒక సమావేశం ఏర్పాటుచేసినట్లు తెలిసింది. నీతిఆయోగ్ ఛైర్మన్... ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు సహకార సమాఖ్య స్ఫూర్తిని చర్చనీయాంశం చేస్తున్న నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. ఈ మేరకు నీతిఆయోగ్ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ అందినట్లు తెలిసింది. ఇందుకు సంబంధించిన ప్రధానంగా కొన్ని అంశాలు ఎజెండాగా నిర్ణయించి సమావేశం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రణాళిక శాఖ వాటికి సంబంధించిన సమాచారాన్ని క్రోడీకరించేలా నివేదిక సిద్ధం చేస్తోంది. ఆయా శాఖలకు వీటిని పంపి సమాచారాన్ని క్రోడీకరించనున్నారు. ఈ లేఖలో ప్రధానంగా సహకార సమాఖ్యలో దేశ ప్రయోజనాలన్న అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. 15వ ఆర్థిక సంఘం విధివిధానాల నేపథ్యంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ కొందరు సమావేశాలు నిర్వహించడం, కొన్ని డిమాండ్లు తెరపైకి తీసుకువస్తూ సహకార సమాఖ్య విధానాన్ని చర్చకు తెస్తున్న నేపథ్యంలో దిల్లీలో ప్రధాని నిర్వహించే ఈ సమావేశం కీలకం కానుంది.

ఈ సమావేశంలో ప్రధానంగా కొన్ని అంశాలను ప్రధాన ఎజెండాగా నిర్ణయించి వాటిపై చర్చించనున్నారు. అవి

- వ్యవసాయరంగం రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేయడం
- ఈనామ్ విధానం
- భూసార పరీక్షకార్డులు, ఉపాధి హామీ జలసంరక్షణ
- కీలక అవసరాలు, వెనుకబడ్డ జిల్లాలకు ఎలాంటి సాయం చేయాలి

## ముస్లింల ఆర్థిక, సామాజిక స్థితులపై

# సచార్ నివేదిక




ఢిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాజిందర్ సచార్ పేరు చెప్పగానే ఆయన ఆధ్వర్యంలోని కమిటీ దేశంలో ముస్లింల స్థితిగతులపై సమర్పించిన నివేదిక గుర్తొస్తుంది. **ముస్లింల సంక్షేమానికి పథకాలు రూపొందించాలనుకునే ఏ ప్రభుత్వమైనా సచార్ కమిటీ ఇచ్చిన నివేదికను అధ్యయనం చేయాల్సిందే.** దేశ జనాభాలో 15 శాతంగా ఉన్న ముస్లింలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా, విద్యాపరంగా ఎంత వెనకబడి ఉన్నారో 400 పేజీల ఆ నివేదిక వెల్లడించింది. ఉన్నతాధికార వ్యవస్థలోనూ, శాంతిభద్రతల పరిరక్షణ విభాగంలోనూ ఆ వర్గానికి సరైన ప్రాతినిధ్యంలేని సంగతిని గణాంకాలతోసహా వివరించింది. ఎస్సీ, ఎస్టీల కన్నా వెనుకబడి ఉన్నారని స్పష్టం చేసింది.

ముస్లింల అభ్యున్నతికి ఎలాంటి చర్యలు తీసుకోవచ్చునో సూచించింది. సైన్యంతోసహా ప్రభుత్వానికి చెందిన సకల విభాగాల్లోనూ ముస్లింల సంఖ్య ఏవిధంగా ఉన్నదో తేల్చడానికి ఆ కమిటీ చేసిన కృషి అంతా ఇంతా కాదు. ఆ ప్రాతి పదికన గణాంకాలిస్తే దురభిప్రాయాలు ఏర్పడతాయని అభ్యంతరాలు వ్యక్తం చేసినా వాస్తవ స్థితిగతులను తెలుసుకోవడానికి వేరే మార్గం ఉండదని జస్టిస్ సచార్ నిష్కర్షగా చెప్పారు. ఇతర విభాగాలు దారికొచ్చినా సైన్యం మాత్రం అయిష్టంగా వివరాలందజేసి, వాటిని బయటకు వెల్లడించడం మంచిది కాదని సూచించింది. ఎంతో శ్రమకోర్చి 2006లో ప్రభుత్వానికి సమర్పించిన ఆ నివేదికను అప్పటి యూపీఏ ప్రభుత్వం సక్రమంగా అమలు చేసి ఉంటే ముస్లింల స్థితి మరింత మెరుగ్గా ఉండేది. ఉత్తర భారత ముస్లింల కంటే దక్షిణభారత ముస్లింల పరిస్థితే కాస్త మెరుగ్గా ఉందని దానికి కారణం ఆయా రాష్ట్ర ప్రజలు అమలు చేస్తున్న రిజర్వేషన్లే అని ఆయన వెల్లడించారు.

ఆయన 1985లో రిటైరైన తర్వాత పౌరహక్కుల ప్రజా సంఘం(పీయూసీఎల్) కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్నారు. 2008లో ముంబైపై ఉగ్రదాడి జరిగాక యూపీఏ సర్కారు చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం(యూఏపీఏ) తెచ్చినప్పుడు దాన్ని నిశితంగా విమర్శించారు. అంతక్రితం పాలించిన ఎన్‌డీఏ ప్రభుత్వం రూపొందించిన ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం(పోటా) దుర్వినియోగమైందని ఆరోపించి, దాన్ని రద్దు చేసిన పాలకులు అంతకన్నా కఠినమైన చట్టాన్ని అమలు చేయాలని చూడటంలోని ఔచిత్యాన్ని ప్రశ్నించారు. ఉగ్రవాదాన్ని నిరోధించడానికి అనుసరించే విధానాలు రాజ్యాంగ సూర్తి కి అనుగుణంగా ఉండాలే తప్ప, వాటిని ఉల్లంఘించేవిగా మారకూడదని ఎలుగెత్తారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కొనే పేరిట మానవ హక్కులను హరిస్తే అది ఉగ్రవాదం మరింత పెరగడానికి దోహదపడుతుందని హెచ్చరించారు. ప్రపంచంలో పౌరహక్కుల కోసం, మానవ హక్కుల కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తించి ఐక్యరాజ్యసమితి మైనారిటీల పరిరక్షణ, గృహ నిర్మాణం వంటి అంశాల్లో ఆయన నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేసింది. ఎన్నో వైరుధ్యాలు, అసమానతలు నిండి ఉండే సమాజంలో ఆధిపత్య వర్గాల తీరుతెన్నులను ప్రశ్నించడం, అసహాయులకు అన్యాయం జరిగినప్పుడు దృఢంగా పోరాడటం, నిరంకుశ ప్రభుత్వాలను ఎదిరించి నిలవడం అందరికీ సాధ్యం కాదు. అందుకు ఎన్నో త్యాగాలు చేయాలి. ఎంతో సమయాన్ని వెచ్చించాలి. జస్టిస్ సచార్ దేనికీ వెరవలేదు. మన రాజ్యాంగాన్ని త్రికరణ శుద్ధిగా పాటిస్తే దేశంలో అసమానతలు, అన్యాయాలు రూపుమాసిపోతాయని జస్టిస్ సచార్ విశ్వసించారు. ఆ విలువలను పాలకులతో పాటింపజేయడానికి శక్తి మేరకు కృషి చేశారు. వినని సందర్భాల్లో విమర్శించారు. ఎందరికో స్ఫూర్తినిచ్చే ఇలాంటి అరుదైన వ్యక్తుల అవసరం పెరుగుతున్న దశలో ఏప్రిల్ 20న తన 95వ ఏట సచార్ కనుమరుగు అయ్యారు.

**ప్రపంచమంతా సుఖంగా ఉండాలి.. అందులో ముస్లింలు కూడా ఉండాలని అల్లాహ్‌ను ప్రార్థిద్దాం**

– బోస్

# దేశ సమస్యలపై స్పందించండి

## జర్నలిస్టు డిసౌజా

**దేశ సమస్యలను పక్కనపెట్టి, సమానత్వం, సహోదరతత్వంతో బ్రతుకుతున్న సమాజంలో విభేదాలను సృష్టించి పబ్బం గడుపుకునే రాజకీయ నాయకులపై జర్నలిస్టు ఫైర్ ...**



దేశ రాజకీయ నాయకులు ప్రజా సమస్యలపై దృష్టి పెట్టకుండా కులం, మతం అంటూ విభేదాలపై చర్చిస్తున్న వారినుద్దేశించి ఆవేదన, ఆవేశం కలగలిపిన గొంతుతో మిర్రర్ నౌ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, అర్బన్ డిబేట్ యాంకర్ ఫాయీ డిసౌజా నిలదీసిన వైనాన్ని ప్రచురిస్తున్నాం..

దేశవాసులకు విద్యా, వైద్యం, ఆహారం వంటి కనీస వసతులపై దృష్టి పెట్టకుండా దేశంలో ఏ చర్చ అయినా మత, కుల విభేదాల పైకి వెళుతుండటం చూస్తున్నాం. ఇంతకు ముందు ఈ పరిస్థితి లేదు. ఈ చర్చాకార్యక్రమం మొదలు పెట్టి ఏడాదిన్నర కావొస్తున్నప్పటికీ ఇప్పటి వరకు నేను ఎప్పుడూ ఆవేశంగా మాట్లాడింది లేదు. **మనం ఒకరిని ఒకరు దూషించుకుంటానికే ఉన్నామా ? ముస్లింలు హింసాత్మకంగా ఉంటారు. క్రిస్టియన్లు మతమార్పిడులు చేస్తారు. హిందువులను మిగతా మతాలవారు తొక్కిపడుతున్నారు అంటూ ఎవరు చెబుతున్నారు మీకు.. ఒక్కసారి మిమ్మల్ని ప్రశ్నించుకోండి.** ఇంతకు ముందు మీరంతా చాలా ఉన్నతమైన రాజకీయ నాయకుల్లా వ్యవహరించేవారు. నిరుద్యోగం, రైతులు, నోట్లరద్దుపై మాట్లాడేవారు. ప్రస్తుతం మన ఆర్థిక మంత్రి చెప్పేదానికి, ఆర్థిక సలహాదారు, రిజర్వుబ్యాంకు ఆఫ్ ఇండియా చెప్పేదానికి కొంచెం కూడా పోలిక ఉండటం లేదు. వారు సమస్యలను పరిష్కరించడానికి ముందుకు రావడం లేదు. ఈ విషయాన్ని ఎవరు ముందుకు తీసుకు వెళుతున్నారు. ప్రతిరోజు బ్యాంకులు వార్తా ప్రతికల్లో కొత్త కథలు వినిపిస్తున్నాయి. **అదేమంటే బ్యాంకులు డబ్బులు కోల్పోతున్నాయి. అవి మన నగదు.. ఆ విషయం మాట్లాడటానికి ఎవరూ ఎందుకు ముందుకు రావడం లేదు.** ప్రభుత్వం విద్యా,వైద్యం, పరిశుభ్రత, తాగునీరు, ఆహార భద్రత కల్పించాలి. అవి ప్రభుత్వ కనీస బాధ్యత. ఇవి ఏ భారతీయ పౌరుడికైనా సక్రమంగా అందుతున్నారని మీరు భావిస్తున్నారా ? దేశంలోని అత్యంత ధనవంతుడు కూడా పరిశుభ్రమైన గాలిని పీల్చలేకపోతున్నాడు. శుద్ధ తాగునీరు, నాణ్యమైన విద్య, వైద్యం అందటం లేదు. చాలా మంది దేశంలో ఆహారం లేక అల్లాడి పోతున్నారు. వారెవరి గురించి మీరెందుకు మాట్లాడలేక పోతున్నారు. ప్రతి ఒక్కరూ మతం, కులం, విబేధాల గురించి మాత్రమే ఎందుకు మాట్లాడుతున్నారు. మన వ్యక్తిగత విషయాలు ప్రజలు ముందుకు ఎందుకు ? ఎంతో సమయం వెచ్చించి కుటుంబంకోసం, జీవితం కోసం సంపాదిస్తున్న సంపాదనతో మనం పన్నులు కడుతున్నామన్న విషయం రాజకీయ నాయకులకు పట్టడం లేదు.. సోషల్ మీడియా, వాట్సప్ ద్వారా విభేదాలు సృష్టిస్తున్నారు. 6నెలల క్రిందట బీబీసీ చెప్పింది బీజేపీ అత్యంతఅవినీతి పార్టీ అని వాట్సప్ మెసేజ్ వచ్చింది. మరో ఆరునెలల తర్వాత కాంగ్రెస్ అవినీతి పార్టీ అని వచ్చింది. నిజానికి రెండూ అబద్దాలే..మన ఆలోచనలను నియంత్రించడానికి ఆ విధంగా వాట్సప్ మెసేజ్‌లు పెడుతున్నారు. వారి వద్ద సాక్ష్యాధారాలు లేకుండానే మనల్ని అబద్ధపు ప్రకటనలలోకి తీసుకువెళుతున్నారు. మనం వాటిని తిప్పికొట్టాలి. **ఎవరైనా మతం గురించి మాట్లాడితే నోరుమూసుకోమని చెప్పాలి. మన మతం,మన కులం మీద వ్యాపారం చేసే హక్కు వారికెవరిచ్చారు ? వాయుకాలుష్యానికి మీరేం చేస్తున్నారు ? నీటి కాలుష్యానికి మీరేమి చేస్తున్నారో చెప్పండని ప్రజలంతా అడగాలి.** ఈ దేశ సమస్యలను ఎలా పరిష్కరిస్తారో చెప్పమని అడగాలి. ఈ దేశంలో ఐదేళ్లలోపు పిల్లలు వ్యాధులతో మరణించడంపై సమాధానం చెప్పమనండి..ఎన్నికల తర్వాత ఎన్నికలు వస్తూనే ఉన్నాయి.అయితే ప్రజలకు మాత్రం కనీస సౌకర్యాలు కూడా అందటం లేదు. నేను నా ప్రేక్షకులకు మాట ఇస్తున్నాను. నా సమయం, శక్తి రెండూ ప్రజల సమస్యలు తీరడానికే వెచ్చించడానికే ఉపయోగిస్తున్నానని, మనం ఈ ఓట్ల కోసం పన్నే కుతంత్రాలను తిప్పికొట్టాలి. మనం ఎన్నటికీ తల వంచమనిచెబుదాం.. మేము మా ప్రజాస్వామ్యాన్ని అమ్ముకోబోవడం లేదు. మీ చౌకబారు రాజకీయాలు ఇప్పటికైనా ఆపండి. అంటూ ఆవేశంగా రాజకీయ వ్యాపారులను హెచ్చరించారు.

– ఖాన్





# నోరూరించే హాలీం...

**రాజధాని ప్రతినిధి, విజయవాడ :** కొన్నేళ్ల క్రితం వరకు ముస్లింలకు మినహా మిగిలిని వారికి హాలీమ్ అంటే తెలియదు. పండుగ రోజుల్లో ఉపవాస దీక్ష చేసే వారు ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతి రోజూ దీక్ష విరముణ అనంతరం పౌష్టికాహారం హాలీమ్‌ను తీసుకోవటం ఆనవాయితీగా వస్తోంది. దీక్ష విరమణ సందర్భంగా ఇఫ్తార్ విందుకు ఎంతటి ప్రాధాన్యం ఉంటుందో, హాలీమ్‌కు అంతటి విశిష్టత ఉంది. విజయవాడలో హాలీమ్ కేంద్రాలు లేనపుడు ఎవరికి వారు ఇళ్లల్లోనే సొంతంగా దీనిని తయారు చేసుకునే వారు. అయితే ప్రస్తుతం అన్ని వర్గాల ప్రజలు దీని రుచికి ఫిదా అవుతున్నారు. విజయవాడ వించిపేట పంజా సెంటరు వద్ద రకరకాల హాలీం స్టాల్స్ వెలిశాయి. దీంతో ముస్లింలతోపాటు, ముస్లిమేతరులు కూడా చికెన్, మటన్, బిర్యానీలను లొట్టలేస్తూ లాగిస్తున్నారు.

ఇక్కడ ఉన్న అనేక హోటళ్లలో ఎస్ స్టాల్ ప్రత్యేకమైంది. ఇందులో హాలీంతోపాటు, చికెన్, మటన్ బిర్యానీలు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ స్టాల్‌ను షేక్ ఇంతియాజ్ , షేక్ మొయీన్ కుటుంబ సభ్యులు 12 నిర్వహిస్తున్నారు. రుమాలీ రోటీ, కడాయి చికెన్, దమ్ చికెన్, మటన్ పాయ, మటన్ బిర్యానీ, బాదంపాలు, మటన్ మసాల, మేక తలకాయలకు ఈ స్టాల్‌లో మంచి డిమాండు ఉంది. ప్రతి రోజు రూ. 30 వేల వరకు అమ్ముతున్నామని అన్ని ఖర్చులూ పోనూ ఆరువేల రూపాయలు మిగులుతాయని వారు వెల్లడించారు. సాయంత్రం 6గంటల నుండి తెల్లవారుజామున ఒంటిగంట వరకు ఈ స్టాల్స్‌లను తెరచి ఉంచుతున్నారు. ప్రజలందరూ రంజాన్ వంటకాలను ఆస్వాదిస్తున్నారని స్టాల్స్ నిర్వాహకులు తెలిపారు.

**42 రకాల పదార్థాలతో హాలీం..**

నోరూరించే ఊరించే హాలీమ్ తయారీకి 42 రకాల పదార్థాలను వినియోగిస్తారు. సహజంగా వేట మాంసం (మటన్) హాలీమ్‌ను తయారు చేస్తారు. కాలక్రామంలో కోడి మాంసంతోనూ (చికెన్) హాలీమ్‌ను తయారు చేస్తున్నారు. సలీమ్ హాలీమ్ సెంటర్‌లో మటన్‌తోపాటు నాణ్యమైన నెయ్యి, గోధుమ పిండితోపాటు తొమ్మిది రకాల పప్పు దినుసులు, మరో 20 రకాల సుగంధ ద్రవ్యాలను ఉపగియోస్తారు. హాలీమ్‌ను తయారు చేసేందుకు కనీసం 12 గంటల సమయం పడుతుంది. ఉదయం ఆరున్నర గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు హాలీమ్‌ను తయారు చేస్తారు. హాలీమ్‌ను తయారు చేసేందుకు ప్రత్యేకంగా ఒక పొయ్యిని ఏర్పాటు చేసి భారీ వంట పాత్రను ఉంచి అందులో గోధుమ పిండి, మటన్ పప్పు దినుసులు, సుగంధ ద్రవ్యాలను వేసి తిప్పుతూ ఉంటారు. ఇలా తిప్పటం వల్లే మంచి రుచి వస్తుందని షేక్ ఇంతియాజ్ చెబుతున్నారు. మీరు ఒకసారి రుచిచూడండి...





## భూసేకరణ బిల్లుకు ఓకే

**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ భూసేకరణ చట్ట సవరణ బిల్లుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆమోద ముద్ర వేశారు. ఒకటి, రెండు రోజుల్లో దీనికి సంబంధించిన నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఏపీ భూసేకరణ చట్ట సవరణ బిల్లును 2013 చట్ట సవరణ ప్రకారం ఆ బిల్లులో ఉన్న నిబంధనల ప్రకారం ఏపీ కూడా చట్ట సవరణ చేసింది. గతంలో తెలంగాణ కూడా అదే విధంగా గుజరాత్‌కు సంబంధించిన భూసేకరణ చట్టసవరణ బిల్లు ఏ విధంగా ఉందో... అందులో ఉన్న అంశాలనే పొందుపంచడంతో కేంద్రం ఆమోదం తెలిపింది. కొత్త చట్ట సవరణ బిల్లువల్ల గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ భూములను కూడా సేకరించే అవకాశం ఉంది. ఈ బిల్లుకు ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో కూడా గతంలో తీర్మానం చేసి కేంద్రానికి పంపిన విషయం విదితమే. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు ఏపీ సర్కారుకు మరింత అవకాశం ఏర్పడింది.



| | |
|---|---|
| మేక్ ఇన్ ఇండియా | ఫెయిల్ |
| డిజిటల్ ఇండియా | ఫెయిల్ |
| స్మార్ట్ సిటీస్ | ఫెయిల్ |
| ఉమెన్ సేఫ్టీ | ఫెయిల్ |
| స్టార్టప్ ఇండియా | ఫెయిల్ |
| స్కిల్ ఇండియా | ఫెయిల్ |
| బ్లాక్ మనీ | ఫెయిల్ |
| రూ. 15 లక్షలు | ఫెయిల్ |
| ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు | ఫెయిల్ |
| జడీపీ వృద్ధి | ఉత్తుత్తిదే |
| బుల్లెట్ ట్రైన్ | ఫెయిల్ |
| గృహపథకం | ఫెయిల్ |
| కాశీ నుంచి క్యోటో | ఫెయిల్ |
| గంగాక్షాణనం | ఫెయిల్ |
| పాక్‌కు బుద్ధి చెబుతాం | ఫెయిల్ |
| చైనాకు సమాధానమిస్తాం | ఫెయిల్ |
| నేపాల్‌తోస్నేహం | ఉన్నదిపోయింది |
| ఫజల్ బీమా యోజన | లూటీ |
| ప్రభుత్వ రంగ బ్యాంకులు | దివాళా |
| లోక్‌పాల్, లోకాయుక్త | మర్చిపోయాం |
| ధరల నియంత్రణ | ఫెయిల్ |
| విదేశీ విధానం | అసలు బాగోలేదు |
| అవినీతి | బాగా పెరిగింది |
| న్యాయవ్యవస్థ | తగ్గుతోంది |

**సీబీఐ, ఈసీఐ, సీవీసీ, ఆర్టీఐ, కాగ్, ఆర్బీఐలకు స్వతంత్ర్య ప్రతిపత్తి లేనేలేదు.అయినా మళ్లీ ఓట్లు వేసి గెలిపించండి**

# మాటల గారడీకి చెక్

**మోడీ మాటలకు చేతలకు అసలు సంబంధమే లేదనేది నాలుగేళ్ల పాలనలో తేలిపోయింది. అచ్చేదిన్ పేరిట ప్రజలను ఆశల పల్లకీలో ఊరేగించి, అరచేతిలో స్వర్గం చూపించారు. అంతకు ముందు ప్రధానులెవ్వరూ ఇంతటి బరితెగింపు ప్రదర్శించలేదు.**

**రాజధాని డెస్క్:** ఇందులో ట్విస్టు ఏమంటే నెరవేర్చని వాగ్దానాలతోపాటు అంతకు ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన వ్యతిరేకించిన జీఎస్టీ అమలు, పెట్రోధరల పెంపు, ఆధార్ అనుసంధానం వంటి వాటిని నిర్దాక్షిణ్యంగా అమలు చేశారు. అంతేకాదు రాత్రికి రాత్రి పెద్ద నోట్లు రద్దు చేసి ప్రజలను రోడ్లపాలు చేశారు. అంతకు ముందు ప్రభుత్వాల్లో ఎంతటి ఆర్థిక వేత్తలు, మేధావులు ఉన్నా వారు ఏవైనా కుంభకోణాలు చేస్తే ఎంతమేరకు ప్రజాధనం బొక్కసాల్లోకి వెళ్లిందో ప్రత్యర్థులు గుర్తించేవారు. కాని ఏం చదివాడో కూడా చెప్పలేని మోడీ, తాను చేపట్టిన ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నం అవడమే కాకుండా ఆర్థిక రంగం స్వరూపమే మారిపోయింది, ఆర్థిక వేత్తలు ఎంతవరకు నిధులు దారి మళ్లించారోకూడా చెప్పలేక పోతున్నారు.

యూపీఏ ప్రభుత్వంలో స్కాములు జరిగాయని బీజేపీకి పట్టంకడితే ప్రజలకు ఎన్‌డీఏ ప్రభుత్వం దిమ్మతిరిగే షాక్ ఇచ్చింది. ఇంత జరుగుతున్నా తమది అవినీతి రహిత ప్రభుత్వమని డప్పాలు కొట్టుకోవడం కొసమెరుపు.

ప్రధాని మోడీ రూపొందించిన మేక్ ఇన్ ఇండియా, స్కిల్ ఇండియా, స్టార్టప్ ఇండియా,డిజిటల్ ఇండియా, ఘోరంగా విఫలం చెందగా, ప్రస్తుతం వాటి పేరు కూడా ఆపార్టీ నేతలు ఎక్కడా ప్రస్తావించడం లేదు. స్మార్ట్‌సిటీలు పత్తాలేవు.. ఇక మహిళలు, బాలల రక్షణ గురించి ఎంత తక్కువ మాట్లాడు కుంటే అంత మంచిది. ప్రధాని పదవికోసం అతిగా ప్రచారం చేసిన విదేశాల్లోని నల్లధనాన్ని వెనక్కు తెప్పించి వందరోజుల్లో ప్రతి భారతీయుడి బ్యాంకులో రూ. 15 లక్షలు వేస్తానన్న విషయం సోదిలోకి రాకుండా పోయింది. రైతులకు స్వామినాథన్ కమిషన్ అమలు చేస్తామన్న మోడీకి రైతులు మమ్మల్ని ఆత్మహత్య చేసుకోనివ్వండి అని లేఖలు రాస్తున్నారు. ఏడాదికి కోటి ఉద్యోగాల మాటెలా ఉన్నా.. అర్ధరాత్రి పెద్దనోట్ల రద్దుతో చిన్న, మధ్యతరగతి, పరిశ్రమలు మూతపడి లక్షలాది మంది ఉద్యోగాలు కోల్పోయారు.

పాకిస్థాన్‌కు బుద్ధి చెబుతాం అంటూ ఆయన ప్రగల్బాలు పలికిన విషయం తెలిసిందే. అందుకు ప్రతిగా భారత ప్రభుత్వానికి తెలియకుండా విదేశాల నుంచి ఎకాఎకిన పాక్ వెళ్లి నవాజ్ షరీఫ్ ఇంట్లో విందుకు హాజరైన ప్రధాని మోడీ మాత్రమే..నేపాల్‌తో ఫ్రెండ్‌షిప్ అన్నమోడీ, ఆదేశం హిందూ దేశంగా కాకుండా లౌకిక దేశంగా రాజ్యాంగాన్ని మార్చుకున్నందని కక్షతో,నేపాల్ -భారతీయ సంతతైన మాథేశీయులను రెచ్చగొట్టి నెలల తరబడి ఆదేశానికి అత్యవసర సరుకులు సరకులు అందకుండా చేసిన ఘనత ఎన్‌డీఏ పభుత్వానిదే..ఎన్నికలు సమీపిస్తున్న వేళ ఆయన మళ్లీ నేపాల్‌కు చేరువయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదే సమయంలో చైనాతో కూడా ఆయన స్నేహసంబంధాలు కొనసాగించడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఫజల్ భీమా, ముద్ర రుణాలతో బీజేపీ కార్యకర్తలు బ్యాంకులను ఆర్థికంగా పీల్చిపిప్పి చేశారు. లోక్‌పాల్, లోకాయుక్తపై ఎంతో మాట్లాడిన మోడీ ప్రస్తుతం వాటి గురించి పట్టించుకోవడం లేదు సరికదా అన్నాహజారే ఎన్ని ఉత్తరాలు రాసినా స్పందించలేదని విసుక్కొని ఆఖరికి ఆయనే నిరాహార దీక్షకు దిగినా ఫలితం లేకుండా పోయింది. సామాన్యుడికి నిత్యావసర వస్తువులు అందుబాటులో లేవని గుండెలు బాదుకొన్న బీజేపీ అధికారం చేపట్టాక ఆవిషయమే మర్చిపోయారు. 2014లో రూ. 450 ఉండే గ్యాస్ ధర ప్రస్తుతం 800 దాటుతోంది.

**• 2012లో మోదీ మాట..**

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే సర్కారు పూర్తిగా విఫలమైందన డానికి పెట్రో ధరల భారీ పెరుగుదలే నిదర్శనం. ఈ పెంపు వల్ల గుజరాత్‌పై వందలాది కోట్ల రూపాయల భారం పడుతోంది.

-2012 మే 23న మోదీ ట్వీట్

2014లో పెట్రోలు బ్యారెల్ 130 డాలర్లు ఉన్న రోజున పెట్రోలు రూ. 75 ఉండగా, 2018లో 70 డాలర్లుగా ఉండగా ప్రస్తుతం అది రూ.100కు చేరువలో ఉంది. దీంతో దేశవ్యాప్తంగా ప్రజలు గగ్గోలు పెడుతున్న పట్టించుకోని ప్రభుత్వం ప్రజలను వెర్రి వాళ్లను చేయడానికి మే 30న పైసా తగ్గించింది. ఎక్సైజ్ డ్యూటీ 10 శాతం నుంచి 12.36కు పెరిగింది. డాలర్‌రేటు 58.50 నుంచి 68.80 కి ఎగబాకింది. స్వచ్ఛభారత్ ప్రచారానికి రూ. 250 కోట్లు ఖర్చుచేసి పారిశుద్ధ్య కార్మికులకు మాత్రం రూ. 35 కోట్లు చెల్లించలేదు. ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడిచే కిసాన్ ఛానల్‌కు రూ. 100 కోట్లు కెటాయింపులు జరిపి, రైతులకు మాత్రం మొండి చేయి చూపుతున్నారు.

జాతీయ నిఘాసంస్థ (సీబీఐ) ఎన్నికల కమిషన్(ఈసీఐ)సెంట్రల్ విజిలెన్స్ సర్వీసు, ఆర్టీఐ, కాగ్,ఆర్బీఐ వంటి సంస్థలకు స్వయం ప్రతిపత్తిని కల్పిస్తామని పేర్కొన్న మోడీ వాటిని ఎంతగా స్వప్రయోజనాల కోసం వాడుకుంటున్నారో ప్రజలు గమనిస్తున్నారు.




గుజరాత్ మోడల్ అభివృద్ధి పేరుతో దేశప్రజలను నమ్మించిన మోడీ కార్పొరేట్లను అందలం ఎక్కిస్తూ సామాన్యుల నడ్డి విరుస్తున్నారు.

ఐక్యరాజ్యసమితిలో అంర్జాతీయ విషయాలు, భారతదేశ విదేశాంగ విధానంపై చర్చించడం వంటి వ్యవహారాలు కాకుండా యోగాను వ్యాప్తిచేయడానికి ఉపయోగించుకొని ఏడాదికి రూ. 500 కోట్లు ఖర్చుపెడుతున్నారు. నిజానికి ఇలాంటి విద్యలు దేశం మొత్తం మీద చాలా ఉన్నాయి. వాటిలో కత్తి,కర్రసాములు కేరళలోని యుద్ధ విద్యలు చాలా ఉన్నా వాటిని పక్కన పెట్టి కేవలం రాందేవ్ (యోగా)బాబాకు ప్రచారం కల్పిస్తున్నారు. హర్యానాలో దీనిపై తరగతులు నిర్వహించడానికి ఆయనకు రూ. 700 కోట్లు ముట్టచెప్పారు. ఇంతేకాదు దిగువతరగతి ప్రజలకు విద్యను దూరం చేసేందుక ప్రాథమిక విద్య బడ్జెట్‌లో 20 శాతం కోత విధించారు. కార్పొరేట్ సంస్థల లక్షల కోట్లుబకాయిలకు రాయితీలు ఇచ్చిన కేంద్రం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఆదుకోవడానికి రూ. 15 వేల కోట్లు ఇవ్వడానికి ప్రభుత్వం వద్ద డబ్బులు లేవు. స్కిల్ ఇండియా ప్రచారానికి రూ. 500 కోట్లు, విద్యార్థుల స్కాలర్‌షిప్‌ల్లో రూ. 500 కోట్ల కోత. ఆదానీ కోసం రైల్వే భూములను అమ్ముతున్నారు. దీన్ని బట్టి చెప్పండి అచ్చేదిన్ ఎవరికి వచ్చిందో ..

**ఎన్‌డీఏకు యువనాయకుల అడ్డుకట్ట**

బీజేపీకి ఎదురేలేదని విర్రవీగుతున్న సమయంలో యువనేతలు అడ్డుకట్ట వేస్తున్నారు. అందులో ఎస్పీనేత అఖిలేష్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్విని యాదవ్ రాష్ట్రీయ లోక్‌దళ్ (ఆర్ఎల్‌డీ) అధినేత అజిత్‌సింగ్ కుమారుడు జయంత్ చౌదరిలూ కలసికట్టుగా ఉండి మోడీ, షా ద్వయానికి చుక్కలు చూపుతున్నారు. 2014ఎన్నికల్లో బీజేపీకి 272స్థానాలు వచ్చాయి. అయితే ఆ తర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాలను కోల్పోతూ మ్యాజిక్ ఫిగర్‌కు దూరమైంది. ఇప్పటి వరకు 23 ఎంపీ సీట్లకు ఉప ఎన్నికలు జరుగగా, కేవలం నాలుగు స్థానాల్లోనే బీజేపీ గెలిచింది. అంటే ఎనిమిది స్థానాలు చేజారాయి. ప్రస్తుతం దానికి ఉన్నది 262 మంది ఎంపీలే మిత్రపక్షాలైన శివసేన, తెలుగుదేశం పార్టీలు బీజేపీతో తెగతెంపులు చేసుకున్నాయి. ఒక ఎంపీని బీజేపీ బహిష్కరించింది. మరో ఎంపీ శత్రుఘ్నుసిన్హా మోడీపరిపాలనపై నిప్పులు కక్కుతున్నాడు. ఈ స్థితిలో బీజేపీకి లోక్‌సభ సీట్ల సంఖ్య 260 కు చేరుకునే పరిస్థితి నెలకొంది. వర్షాకాల సమావేశాల్లో అవిశ్వాసం పెడితే మోడీకి దెబ్బే.



'నల్లధనం వెనక్కి తెస్తామన్న మోదీ, అమిత్ షాల మాటలు నమ్మి ఫూల్ అయ్యా'

**వేవ్ కాదు వాపు..**

దేశంలోని 29 రాష్ట్రాల్లో 21రాష్ట్రాల్లో అధికారంలో ఉందనడం సరికాదు. కేవలం 10 రాష్ట్రాల్లో మాత్రమే అధికారంలో ఉంది. మిగతారాష్ట్రాల్లో దానికి ఉన్న సీట్లు సిక్కిం, మిజోరం, తమిళనాడుల్లో కేవలం సున్నా సీట్లు, 175 సీట్లున్న ఆంధ్రాలో మూడు, 140 సీట్లున్న కేరళలో ఒకే ఒక్కసీటు ఉండగా, 117 సీట్లున్న పంజాబ్‌లో 3 సీట్లతో సరిపెట్టుకోగా, 294 సీట్లున్న పశ్చిమ బెంగాల్‌లో మూడు, 119 సీట్లున్న తెలంగాణలో 5 సీట్లు, 70 సీట్లున్న ఢిల్లీలో మూడు, 147 స్థానాలున్న ఒడిషాలో 10 సీట్లు, 60 సీట్లున్న నాగాలండ్‌లో 12 సీట్లు ఉన్నాయి. మిగతా పార్టీలతో కలిపి ఏర్పాటు చేసిన ప్రభుత్వాల్లో 60సీట్లున్న మేఘాలయాలో బీజేపీకి కేవలం రెండే సీట్లు, 243 సీట్లున్న బీహార్‌లో 53, జమ్మూకాశ్మీర్‌లో 87సీట్లకు 25, గోవాలో 40కి 13 సీట్లు ఉన్నప్పటికీ ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. దేశంలో మొత్తం అసెంబ్లీ సీట్లు 4,139 ఉండగా, బీజేపీకి 1,516 సీట్లున్నాయి. అంటే 37 శాతం మాత్రమే సీట్లున్నాయి. ఆ మొత్తంలో 950 సీట్లు గుజరాత్, మహారాష్ట్ర, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాష్ట్రాలవే. ఇది నిజం.. దేశం మొత్తం మీద బీజేపీ గాలి వీస్తుందనడం పూర్తిగా అబద్ధం. దేశంలోని ఐదురాష్ట్రాల్లో మాత్రమే ఒంటరిగా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. మహారాష్ట్రలో శివసేన లేకుండా అధికారం చేపట్టగలిగి ఉండేది కాదు. మోడీ హవానా.. వాపా మీరే చెప్పండి.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/s Vastitude Media Pvt. Ltd., and Printed at M/s Jagati Publications Ltd., Sakshi Press, Survey No. 766/2, Ankireddy Palem Village, Guntur Rural, 522005, Guntur Distt. A.P. and Published at 6-45/1, Rayapudi, Thullur Mandal, Guntur Distt, Andhra Pradesh-522237. Editor: Pattan Hussain Khan, RNI NO: APTEL/2015/66622, Postal Regd No: GTR/84/2016-18, Cell 9440662699, Email : rajadhanivartalu1@gmail.com